స్థాపితము 1928 రిజిస్టర్ నెం ఎ 93

గోలకొండపత్రిక

సంపాదకుడు: ఎన్. నరోత్తమ రెడ్డి ఎమ్. ఏ.

సంపుటి: 14 సంచిక: 192 :: హైదరాబాద్, శనివారము 22 - 7 - 1961 :: 4 పేజీలు 7 నయాపైసలు

మరో బస్సు ప్రమాదంలో 20 మంది బదరీ యాత్రికుల మృతి

డెహ్రాడూన్, జులై 21

బదరీనాథ్ యాత్రకు వెళుతున్న మరో 20 మంది ప్రయాణీకులు యీవేళ సంభవించిన బస్సు ప్రమాదంలో చనిపోయారు. గర్వాల్ జిల్లాలో శ్రీనగర్ వద్ద బదరీనాథ్ రూటులో బస్సు లోయలోపడి నేడు మరో ప్రమాదం సంభవించిందన్న మాట. ఈమధ్య బదరీరూట్‌లో బస్సు ప్రమాదాలు తరుచు జరుగుతున్న విషయం పాఠకులెరిగినదే.

1 వ ప్రయిజు రు. 1,00,000 గెలవండి.

కళ్ళికోట లాటరీ

ముగింపు 12-10-61 టిక్కెటు 1 టి రు. 1/- డ్రా: 19-11-61
6 టి. రు. 5/-, 14 టిక్కెట్లుగల 1 బుక్కు రు. 12/-. 56 టి. రు. 40/-

సిక్కిం లాటరీ

ముగింపు: 9-9-61. టిక్కెటు 1 టి రు. 1/- డ్రా: 15-9-61
6 టి. రు. 5/-, 19 టిక్కెట్లుగల 1 బుక్కు రు. 12/- 76 టి. 40/-

వెంటనే క్రింది డిస్ట్రిబ్యూటర్‌కు డబ్బు పంపండి.

జి. ఎతిరాజులు,
9-8-5 (2), బ్రాహ్మణవీధి, విజయవాడ-1.

విదేశాల స్వచ్ఛందసహాయాన్ని కోరుతూ ట్యునీషియా విజ్ఞప్తి

అల్జీరియా, ఐక్యఅరబ్ రిపబ్లిక్, యుగోస్లావియాల హామీ

బిజెర్టా పై బాంబుల వర్షం: నగరంలోకి ఫ్రెంచిసేనల ప్రవేశం

ట్యునిస్, జులై 21

బిజెర్టా నగరంమీద యీ ఉదయం నుండి ఫ్రెంచివిమానాలు బాంబుల్ని వర్షిస్తున్నాయనీ నగరంలోకి ప్రవేశించిన ఫ్రెంచి సైనికులతో వీధుల్లో యుద్ధాలు జరుగుతున్నాయనీ యీ రాత్రి ట్యునీషియా ప్రభుత్వం ప్రకటించింది. అయితే బాంబులు వేయబడుతున్నాయన్న వార్తను ఫ్రాన్స్ ఖండించింది.

ట్యునీషియా అధ్యక్షుడు బోర్గిబా తాను విదేశీ స్వచ్ఛంద సైనికుల సహాయాన్ని స్వీకరిస్తానని నేడు ప్రకటించాడు, అల్జీరియా విప్లవవాద ప్రభుత్వం వెంటనే తాము సైనిక సహాయము అందజేస్తామని హామీ యిచ్చింది.

బిజెర్టా స్థావరం నుండి అందరూ ఖాళీచేసి వెళ్ళాలన్న ఫ్రెంచి అల్టిమేటంను నిరాకరించి బిజెర్టాను ఎంతకయినా సరే కాపాడడానికి నిలువాలని తాను ఆదేశించినట్లు బోర్గిబా ప్రకటించాడు. ఫ్రెంచి ప్రభుత్వము అల్టిమేటం వార్తనుకూడా ఖండించింది.

ట్యునీషియాకు సాయపడడానికి ఐక్య అరబ్ రిపబ్లిక్ కూడా నిర్ణయించింది. యుగోస్లావియా ప్రభుత్వం నుండి కూడా ట్యునీషియాకు సహాయం అందజేయగలమన్న వాగ్దానము అందింది.

ట్యునీషియా ఫిర్యాదును పరిశీలించేందుకు భద్రతామండలి అత్యవసర సమావేశం నేడే (శుక్రవారం) ఏర్పాటయింది.

బిజెర్టా ((ఫ్రెంచి) స్థావరానికి వెలుపల ఉన్న బిజెర్టా నగరాన్ని స్వాధీనపరచుకోడానికి ఫ్రెంచి సేనలు ట్యునీషియా సేనలతో పోరాడుతున్నట్లు వార్తలు చేరాయి.

సహారాలోని ట్యునీషియా దళాలపైకూడా ఫ్రెంచి టాంకు దళాలు దాడి ప్రారంభించాయని తెలుస్తున్నది. బిజెర్టా నగరంలో నీరు, విద్యుచ్ఛక్తి సప్లయిలు బందయ్యాయి బిజెర్టా స్థావరంలో 3600 మంది ఫ్రెంచి సైనికులున్నట్లు ప్యారిస్ వార్త.

బిజెర్టా నౌకా స్థావరం నుండి మూడు ఫ్రెంచి యుద్ధనౌకలు బిజెర్టా నగరంలోనికిప్రవేశించే కాలువద్వారా నగరంవైపు ప్రయాణంచేస్తున్నాయని ట్యునీషియా దేశీయాంగశాఖ ఈరాత్రి ప్రకటించింది. నేడు బిజెర్టామీద బాంబింగ్‌గాని విమానాల ద్వారా దిగిన సైనికులు సాగిస్తున్న పోరాటంగాని 6 గంటలపైబడి జరుగుతున్నప్పటికీ ట్యునీషియా సైనికులు వారిని ఎదిరిస్తూనే ఉన్నట్లు తెలుపబడింది.

బిజెర్టా పోరాటములో ఫ్రాన్స్, ట్యునీషియాలు రెండూ అమెరికా పరికరాలను ఆయుధాల్నే వాడుతున్నాయని అమెరికా పత్రికలు వ్రాశాయి.

ఫ్రాన్స్‌తో ఏర్పడిన వివాదాన్ని భద్రతామండలి వెలుపలనే పరిష్కారము చేసుకోవాల్సిందిగా అమెరికా ట్యునీషియానుకోరుతున్నదని కూడా తెలిసింది. అమెరికా పత్రికలు యీ వివాదాన్ని శాంతి పద్ధతుల ద్వారా పరిష్కరించడానికి ట్యునీషియా ప్రయత్నించలేదని విమర్శించుతున్నాయి.

ఒకవేళ భద్రతా మండలిలో బిజెర్టా సమస్యపై ఓటింగు జరిగితే— బెర్లిన్ సమస్య కారణంగా— అమెరికా ఫ్రాన్సును సమర్థించగలదట. అప్పుడు ట్యునీషియా ఆఫ్రోఏషియా రాజ్యాల మద్దతుతో తనవివాదాన్ని సమితి జనరల్ అసెంబ్లీ అత్యవసర సమావేశానికి నివేదించే అవకాశం ఉంటుందని భావించబడుతున్నది.

ఇరాన్‌లో అరెస్టులు

టెహరాన్, జులై 21

ముసాదిక్ అనుకూల నేషనల్ ఫ్రంట్ నాయకులందర్ని నేటి ఉదయము ఇరాన్ పోలీసువట్టివేసి జైలులో నిర్బంధించినది.

నేషనల్ ఫ్రంట్ కార్యాలయాన్ని గూడా పోలీస్ ఆక్రమించినది.

ట్యునీషియాకు అరబ్ లీగు కౌన్సిల్ మద్దతు

కైరో, జులై 21

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాగిస్తున్న పోరాటంలో ట్యునీషియాకు ఎల్లవిధాలా సహాయం చేయడానికి నిర్ణయిస్తూ అరబ్ లీగ్ కౌన్సిల్ గతరాత్రి ఒకతీర్మానం చేసింది. ట్యునీషియాపై ఫ్రెంచిదురాక్రమణకూడా నిరసించబడింది.

నర్మదా నది పొంగులు

ఇందోర్, జులై 21

నర్మదా నది నీటిమట్టం పెరుగుతున్నది. ఈ నదిపైగల కాల్‌ఘాట్ బ్రిడ్జి ఈ నది వరద నీటిలో మునిగిపోవడంవల్ల బొంబాయి, ఆగ్రా నేషనల్ హైవేమీద రాకపోకలన్నీ ఆగిపోయినవి. ఈ బ్రిడ్జిపైన ఐదు అడుగుల ఎత్తుగా నర్మదా నది నీరు ప్రవహిస్తున్నదట.

ఉన్నతపదవుల్లో ఉన్నవారి విదేశపర్యటనలు

ముందుగా ప్రభుత్వ మంజూరీ ఉండాలని ప్రధాని అభిప్రాయం

న్యూఢిల్లీ, జులై 21

విదేశాలు తమ దేశాలో భారతీయులు పర్యటించేందుకై కల్పించిన ప్రత్యేక గ్రాంటుల్ని ఉన్నత పదవుల్లో ఉన్న భారతీయులు వినియోగించుకోడానికి ప్రధాని నెహ్రూ సుముఖంగా లేరు.

భారతదేశ విదేశ ద్రవ్య మారకస్థితి దృష్ట్యా విదేశాలకు పంపబడే ప్రతినిధివర్గాల సంఖ్య కూడా సాధ్యమైనంత వరకూ తగ్గించబడాలని నెహ్రూ వాంఛిస్తున్నారు.

సాధారణముగా ఢిల్లీలోని రాయబార కార్యాలయాలతో సంప్రదించి విదేశీ పర్యటనలు ఏర్పాటు చేసుకోడము జరుగుతున్నదనీ ముందుగా ప్రభుత్వ మంజూరీ పొందనిదే ఉన్నత పదవుల్లోని వారు యిలాంటి విదేశీ ప్రయాణాలకు ఏర్పాట్లు చేసుకోడము తగదనీ నెహ్రూ భావిస్తున్నారు. ఈ అంశాలు కేంద్ర మంత్రివర్గ కార్యదర్శి పంపిన సర్క్యులర్‌లో పేర్కొన బడ్డాయట.



భారతదేశములోని మూడవ జాతీయ మ్యూజియంగా సాలార్ జంగ్ మ్యూజియమ్‌ను 20వ తేదిన ప్రారంభిస్తున్న కేంద్ర సాంస్కృతిక వ్యవహారాలమంత్రి ప్రొ॥ హుమాయూన్ కబీర్. గవర్నర్ శ్రీ సచార్ అధ్యక్షత వహించారు.

విజయవంతంగా 3వ రోదసీయాత్ర

116 మైళ్ల ఎత్తున 4900 మైళ్ల వేగంతో పావుగంటసేపు కెప్టెన్ గ్రిస్సం అంతరిక్షయానం

కేప్ కానవరల్, ఫ్లోరిడా, జులై 21

మూడవ అంతరిక్ష యాత్రికుడుగా కెప్టెన్ వర్జిల్ గ్రిస్సం (35) యీవేళ బ్రహ్మాండమైన రెడ్‌స్టోన్ రాకెట్‌ద్వారా రోదసిలోకి పంపబడి 115 మైళ్ళ ఎత్తున 15 నిమిషాలు అంతరిక్ష ప్రయాణముచేసిన అనంతరం క్షేమంగా భూమికి చేరుకున్నాడు.

యూరీ గగారిన్ (రష్యా), అలాన్ షెపర్డు (అమెరికా) ల తరువాత రోదసి యాత్రచేసిన వ్యక్తి గ్రిస్సం (అమెరికా). గ్రిస్సం రోదసియాత్రి వాతావరణ ప్రాతికూల్యంవల్ల రెండు సార్లు వాయిదాపడి చివరకు నేడు సఫలమైంది. గ్రిస్సం గంటకు 4900 వేగంతో రోదసిలో పరిభ్రమించాడు.

కెప్టెన్ గ్రిస్సం ప్రయాణం చేసిన రాకెట్ పేటిక అట్లాంటిక్ సముద్రములో పడగా హెలికాప్టర్ ద్వారా ఆతడు నౌకలోకి చేర్చబడి ఒడ్డుకు వచ్చాడు. తరువాత ఆపేటిక సముద్రములో మునిగిపోయింది.

రోదసీయాత్ర అంతాసక్రమంగానే జరిగిందనీ తాను రాకెట్ పేటిక కిటికీ నుండి విశ్వదృశ్యాన్ని చూస్తూ మైమరచి పోయాననీ గ్రిస్సం చెప్పాడు. భూమికి దిగి వచ్చేప్పుడు ఆతడున్న రాకెట్ పేటిక తుపాకినుండి దూసుకు వచ్చినగుండు తిరిగేట్లు గిరగిరా తిరుగుతూవచ్చి అట్లాంటిక్ సముద్రంలో పడిందట. ఈ తిరుగు ప్రయాణంలో భూమ్యాకర్షణశక్తి పదింతలుగాఉన్నట్లూతనికి తోచిందట.

గ్రిస్సం ప్రయాణం చేసిన రాకెట్ పేటికలో ఒకవేళ రాకెట్ మధ్యలో చెడిపోయినా కూడా ప్రమాదంజరుగకుండా ఉండగల రక్షణ సాధనాలన్నీ ఉంచబడ్డాయి.

అట్లాంటిక్ సముద్రం నుండి నౌక మీదికి చేర్చబడిన గ్రిస్సం యిప్పుడా నౌకలో గ్రేట్ బహామా దీవికి ప్రయాణమై వెళ్తున్నాడు. ఆతడక్కడ రెండు దినాలుంటాడు. ఆతని ఆరోగ్యము బాగానే ఉన్నదని అధికార ప్రకటన వెల్వడింది.

అంకలేశ్వర్ వద్ద మరో నూనెబావి

అంకలేశ్వర్, జులై 21

ఇక్కడికి 6 మైళ్ళ దూరంలోగల ఉమర్‌వాడ గ్రామంవద్ద 14 నెంబర్ బావిలో నూనె బయల్వెడలినది. మే 5నుండి ఈ నూనెబావి త్రవ్వకం జరుగుతున్నది. ఈ ప్రాంతంలో నూనె కనుగొన్న బావిలో ఇది 11వది.

వారణాశిలో కలరావల్ల ఒక్కరోజులో 6 గురి మృతి

వారణాశి, జులై 21

గత 24 గంటల్లో వారణాశిలోని అంటువ్యాధుల చికిత్సా కేంద్రములో 6 గురు కలరావల్ల చనిపోయారు.

మొత్తం 19 మందికి కలరాసోకి యీ ఆసుపత్రిలో చేర్చబడ్డారు.

సెప్టెంబరులో శ్రీ మురార్జీ విదేశ పర్యటన

న్యూఢిల్లీ, జులై 21

సెప్టెంబరు 12 న ప్రారంభమయ్యే కామన్వెల్తు ఆర్థికమంత్రుల సమావేశానికి భారతఆర్థికమంత్రి శ్రీ మురార్జీ దేశాయి హాజరు కాగలరు. ఈ సమావేశము మూడు దినాలు సాగుతుందనుకుంటున్నారు.

కామన్వెల్తు ఆర్థికమంత్రుల సమావేశాన్ని గురించి బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ నిన్న కామన్స్‌సభలో ప్రకటించాడు. అయితే ఆయన సమావేశము జరిగేస్థలము చెప్పలేదు; బహుశా ఘనా రాజధాని ఆక్రాలో జరుగగలదని అభిజ్ఞులు భావిస్తున్నారు. ఒకవేళ లండన్‌లోనే జరిగినాజరుగ వచ్చునట.

శ్రీ మురార్జీ దేశాయి వెంట ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి శ్రీ ఎన్. కె. ఝా కూడా వెళ్లుతారు.

ఈ సమావేశము అనంతరము శ్రీ మురార్జీ వియన్నాలో జరిగే ఫండ్ బ్యాంక్ సమావేశానికి కూడా హాజరవుతారు.

శ్రీ మురార్జీ ఆర్థికమంత్రుల సమావేశానికి వెళ్ళేముందు నైజీరియాలోను మరికొన్ని తూర్పాఫ్రికా దేశాల్లోను పర్యటించగలరని కూడా తెలుస్తున్నది.

కాని భారత ప్రధాని నెహ్రూ బెల్‌గ్రేడ్‌లో జరిగే తటస్థ రాజ్యాల శిఖరాగ్ర సమావేశానికి వెళ్ళే పరిస్థితిలో శ్రీ మురార్జీ తన తూర్పాఫ్రికా దేశాల పర్యటన మానుకుంటారు.

బాలాజీభవన్‌లో దివ్యజీవనసంఘ సభలు

హైదరాబాదు, జులై 21

ఆంధ్రప్రదేశ్ దివ్యజీవన సంఘ ద్వి సమ్మేళన సభలు, గురు పూర్ణిమ ఉత్సవాలు యీనెల 27, 28, 29 తేదీలలో హిమాయత్‌నగర్‌లోని బాలాజీ భవన్‌లో జరుగుతాయి ఈ సందర్భంలో రోజు లక్షార్చన, అఖండ సంకీర్తన నిర్వహించబడుతవి. ఇంకా పండితులు యతులు దివ్యజీవనమునకు సంబంధించిన వివిధ అంశములపై ఉపన్యాసముల సభలు, యోగాసన ప్రదర్శనలు ఏర్పాటు చేయబడినవి- తొలిరోజు ఉదయం. జరిగే కార్యక్రమానికి రాష్ట్ర శాసన సభాపతి శ్రీ అయ్యదేవర కాళేశ్వర రావు, అధ్యక్షత వహిస్తారు.

మరో పదేళ్ళలో చంద్రమండలానికి మానవుని యాత్ర

అంతరిక్ష పరిశోధనలకై 1784 మిలియన్ డాలర్ల వ్యయానికి కెన్నడీ ఆమోదం

వాషింగ్‌టన్, జులై 21

మరో పది సంవత్సరాలలోగా చంద్రమండలానికి మానవుని పంపేందుకు అనువుగా అంతరిక్ష పరిశోధనలప్రణాళికను విజయవంతంగా నిర్వహించే నిమిత్తం అమెరికా ప్రభుత్వం 1784 మిలియన్ డాలర్లను వెచ్చించ దలిచింది.

ఇందుకు సంబంధించిన బడ్జెటుకు నేడు ప్రెసిడెంట్ కెన్నడీ ఆమోదముద్రవేసినానని చట్టంగా ప్రకటించాడు.

కెప్టెన్ గ్రిస్సం మూడో అంతరిక్ష యాత్రికుడుగా విజయుడయి తిరిగి భూమిని చేరిననాడే యీ అంతరిక్ష పరిశోధనల బడ్జెటును కెన్నడీ చట్టం చేయడం కాకతాళీయమని తెలుస్తున్నది.

గజ్వేలు, భద్రాచలం ద్విసభ్య నియోజక వర్గాల్ని గురించి అభ్యంతరాలు

హైదరాబాద్, జులై 21

ఎలెక్షన్ కమిషన్‌కు మెమోరాండాం సమర్పణ

గజ్వేలు ద్విసభ్య నియోజక వర్గాన్ని జనరల్ నియోజక వర్గంగా ప్రకటించాలని కోరుతూ అఖిల పక్ష చర్యాసంఘ ప్రతినిధివర్గం నేడు ఎలక్షన్ కమిషన్‌ను కలిసి అభ్యర్థించింది. గజ్వేలులో హరిజనులు 19 శాతం మాత్రమే ఉన్నారనీ కాబట్టి దాన్ని రిజర్వుడ్ స్థానంగా మార్చరాదనీ యీ ప్రతినిధివర్గం కోరింది.

ప్రతినిధివర్గంలో శ్రీయుతులు సత్యనారాయణ రెడ్డి, సి. శ్రీనివాస్, రంగారెడ్డి ఉన్నారు.

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ శ్రీ కె. వి. కె. సుందరం, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ శ్రీ పి. సుబ్రహ్మణ్యంలకల ఎలక్షన్ కమిషన్ ఆంధ్ర ప్రదేశ్‌లో ద్విసభ్య నియోజక వర్గాల విభజన పథకాన్ని గురించిన అభ్యంతరాల్ని పరిశీలించడం నేడు ప్రారంభించింది, జులై 28 వరకూ యీ పరిశీలన సమావేశాలు సాగుతాయి.

భద్రాచలం ద్విసభ్య నియోజక వర్గాన్ని సాధారణ నియోజకవర్గంగా మార్చి యెల్లవరం గిరిజన నియోజక వర్గంగా ఏర్పరచడాన్ని వ్యతిరేకిస్తూ 21మంది ఎం.ఎల్.ఎలు నేడు ఎలక్షన్ కమిషన్‌కు మెమోరాండం సమర్పించారు. యెల్లవరంలో గిరిజన జనాభా తక్కువనీ భద్రాచలం ప్రాంతంలోనే 56 వేలమంది గిరిజనులున్నారనీ తెలుపబడింది.

శ్రీకాకుళం జిల్లాలోని సాలూరు ద్విసభ్య నియోజకవర్గం గురించి ఏ అభ్యంతరం చేరలేదు.

ఆంధ్రప్రదేశ్‌లో 48 ద్విసభ్య నియోజక వర్గాలు శాసన సభకై ఉన్నాయి. వాటిలో ఒక్కొక సీటు షెడ్యూల్డు కులాలకు కేటాయించబడింది. మరో 9 ద్విసభ్య స్థానాలలో గిరిజనులకు కేటాయింపుఉంది అలాగే పార్లమెంటుకుగల 3 ద్విసభ్య స్థానాలలో షెడ్యూల్డుకులాలకు. 2ద్విసభ్య స్థానాలలో గిరిజనులకు కేటాయింపు ఉంది.

డిసెంబరులో మలయారాజు భారత పర్యటన

న్యూఢిల్లీ, జులై 21

భారత ప్రభుత్వ ఆహ్వానాన్ని పురస్కరించుకొని మలయారాజు డిసెంబరులో భారతదేశ పర్యటనకు రానున్నారు. డిసెంబరు 7 న ఆయన ఢిల్లీ చేరతారు. ఆయన డిసెంబరు 18 వరకు ఇండియాలో ఉంటారు.

రాష్ట్రపతి ఆరోగ్య స్థితి కొద్దిగా మెరుగు

ఒంటికి నెత్తురెక్కిస్తున్నారనీ స్మృతిలోనేఉండి ప్రధానితో ముచ్చటించారనీ వర్తమానం

న్యూఢిల్లీ, జులై 21

రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాదు ఆరోగ్య పరిస్థితి ఈ ఉదయం నుండి కొంత మెరుగై రోజంతా అలాగే ఉన్నట్లు యీరాత్రి డాక్టర్లు ప్రకటించారు. కేవల ద్రవాహారము యివ్వబడుతున్న డా॥ ప్రసాదుకు రక్తంకూడా ఎక్కిస్తున్నారు.

ఈ వేళ ప్రధాని శ్రీ నెహ్రూ నర్సింగ్ హోంకు వెళ్ళి రాష్ట్రపతిని మూడు సార్లు పరామర్శించారు. రాష్ట్రపతి పూర్తి స్మారక స్థితిలోనే ఉండి శ్రీ నెహ్రూతో ముచ్చటించారు కూడా. నేటి పరిస్థితి రేపటి వరకూ కొనసాగితే ఆపరేషన్ అవసరము ఉండదనిడాక్టర్లుభావిస్తున్నారు.

రాష్ట్రపతి ఆరోగ్య పరిస్థితి బాగుపడి త్వరగా త్వరమే కోలుకోవాలని ఆశిస్తూ కలకత్తానుండి అమెరికా రాయబారి గాల్‌బ్రైత్ నేడొక పరామర్శ సందేశం అందజేశాడు. డా॥ ప్రసాద్ ఆరోగ్యస్థితి కారణంగా ప్రధాని నెహ్రూ తన హోషూర్ పర్యటనను నేడు మానుకొన్నారు.

ప్రఖ్యాత బొంబాయి సర్జన్ డా॥ ఎ.వి. బాలిగా యీసాయంత్రము ఢిల్లికి వచ్చి డా॥ ప్రసాద్‌ను పరీక్షించారు.

వందలాది ప్రజలు నర్సింగ్ హోం వెలుపలనిలిచి డాక్టర్ల ప్రకటనలు చదువుకుంటున్నారు.

ఉప రాష్ట్రపతి డా॥ రాధాకృష్ణన్, కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ నీలం సంజీవరెడ్డి, శ్రీమతి ఇందిరాగాంధి, జయప్రకాశ్ నారాయణ, కేంద్ర మంత్రులు పలువురు నేడు వచ్చి డా॥ ప్రసాద్‌ను చూశారు.

దొంగపత్రాలు సృష్టించినందుకు జైలుశిక్ష

న్యూఢిల్లీ, జులై 21

దొంగ పత్రాలు సృష్టించినందుకుగాను ఢిల్లీలోని కరియాగంజ్‌కు చెందిన శ్రీ కళ్యాణ్‌సింగ్ జోహార్ కుమారుడు శ్రీ కిర్పాల్ సింగ్ జోహారుకు ఆరునెలల కఠిన జైలుశిక్ష, రూ. 150లు మొత్తము జరిమానా విధించారు. జరిమానా కట్టకపోతే ఆయన మరో రెండు నెలల జైలుశిక్ష అనుభవింపవలసి ఉంటుంది.

శ్రీ డి. పి. భార్తియాతో కలిసి నిందితుడు కుట్రపన్ని, దిగుమతి లైసెన్సులు సంపాదించేందుకై ప్రభుత్వాన్ని మోసగింప ప్రయత్నించాడని విచారణలో తేలింది. శ్రీ డి. పి. భార్తియా విచారణ సమయంలో చనిపోయారు. డి. పి. భార్తియా అండ్ కంపెనీ అన్న పేరుగల కంపెనీ తరపున, దాని మేనేజింగ్ పార్టనర్ శ్రీ కె. సి జోహార్ దొంగ అకౌంట్ల సర్టిఫికెట్లు దొంగ కొనుగోలు పత్రాలు సృష్టించి ప్రభుత్వానికి అందజేశాడు.

మంగళూరు, కంపిలి పూర్తిగా జలమయం

మైసూరు రాష్ట్రంలో వరదల తీవ్రత

మంగళూరు, జులై 21

గత రెండు దినాలుగా కుంభవృష్టి కురుస్తూ వాగులు నదులు ఉప్పొంగి వరద నీరు అన్నిరోడ్లనూ జలమయం కావించడంతో మంగళూరు పట్టణంతో రాక పోకల సౌకర్యాలన్నీ అందయ్యాయి. బరకూరు, మబుకళ, కల్యాణపుర, నేత్రవతీనదులు ఉప్పొంగుతున్నాయి. బొంబాయి నుండి మంగళూరుకు నడిచే విమానం నేడు నర్రైన సమయానికి వచ్చినప్పటికీ విమానాశ్రయం నుండి నగరంలోకి పోయేమార్గం వరదనీట మునిగిపోయినందున ప్రయాణీకులు, పార్శిళ్ళు విమానాశ్రయంలోనే ఉండిపోవలసి వచ్చింది.

ఉత్తర కెనరా జిల్లాలోని పారిశ్రామిక నగరం దండేలీలో వరద పరిస్థితుల పరిణామంగా కలరా వ్యాధి ప్రారంభమైంది.

కావేరీ పరీవాహ ప్రాంతమంతటా నేడు విపరీత వర్షాలు కురిసినందున కృష్ణరాజసాగర్ జలాశయం పొంగి పొర్లే ప్రమాదం ఉన్నట్లు భావించబడుతున్నది.

నిన్నటినుండి తుంగభద్రా నదిలో వరదలు ఉద్ధృతమైనందున ప్రఖ్యాత చారిత్రక గ్రామం కంపిలిలో 8 అడుగుల లోతు నీరు ప్రవహిస్తున్నది. కోటలోని 200 ఇళ్ళు జలమయమయిపోయాయి,

తుంగభద్రా డాం వంతెనపయి రాకపోకలన్నీ నిలిపివేయబడ్డాయి.

శిరిగుప్ప తాలూకాలోని నడిలి, మానూర్ గ్రామాల్లోకూడా మూడడుగుల లోతు నీరు ప్రవహిస్తున్నది.

తుంగభద్ర వరదలు

కర్నూలు, జులై 21

తుంగభద్రా నదిలో వరదలు వస్తున్నాయి. నిన్నటి నుండి సుళ్లు తిరుగుతూ వరదనీరు ఒడ్డుల్ని ఒరుసుకొని పారుతున్నది. కర్నూలు నగరానికి తక్షణ ప్రమాదం ఏమీ లేకపోయినప్పటికీ జిల్లా అధికారులు అవసర జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

నదిగట్ల వెంబడిగల కొన్ని వల్లపు ప్రాంతాల్లోకి వరదనీరు ప్రవేశించింది

వరంగల్ జిల్లా సంక్షేమ, జలాధార, రహదార్లపథకాలు

మొత్తం 2.66లక్షలు మంజూరు చేస్తూ పరిషత్ ఆర్థిక స్థాయీసంఘ నిర్ణయం

(స్వ.వి)

వరంగల్, జులై 21

వరంగల్ జిల్లా పరిషత్తు ఆర్థిక స్థాయీ సంఘ సమావేశము మోహనీన్‌ఖాన్ పబ్బీర్ అధ్యక్షతన జరిగినప్పుడు సాంఘిక సంక్షేమపథకాలకిందరు. 45.5 వేలు మంజూరుచేయబడినవి. జిల్లాలోని చిన్న జలాధారాల (అవసర) సత్వర మరమ్మతులకుగాను 25 వేల రూపాయలను కూడా మంజూరు చేస్తూ జిల్లాపరిషత్ ఆర్థికసంఘం తీర్మానము చేసింది.

ఈ మొత్తం కాక మరొక రు. 39 వేలను 23 చిన్న జలాధారాల నిర్మాణము కొరకు కూడా ఈ సంఘము మంజూరుచేసింది.

గ్రంథాలయం కొరకు పుస్తకముల కొనుగోలుకు 15రూపాయలుకూడా మంజూరుచేయబడినవి. మరొక మొత్తం రు. 3 వేలు జిల్లాపరిషత్తులో బల్లలు, కుర్చీలు, వగైరా కొనుగోలుకుమంజూరివ్వబడింది.

ఈ ఆర్థిక సంఘం సమావేశములో నర్సంపేటతాలూకా బహుళార్థసాధక పథకానికి పరిహారాను గ్రామాల సంవత్సర ఆయవ్యయపట్టికఆమోదించబడింది. కొడకండ్ల పంచాయతీ సమితి సంవత్సరబడ్జెట్ కూడా ఆమోదించారు.

గ్రామీణ రహదారి పథకం క్రింద ఖర్చుచేయవలసిన మొత్తానికై ఎలా ఖర్చుచేయాలో ఒకపథకాన్ని రూపొందించవలసిందిగా జిల్లా పరిషత్ కార్యదర్శిని కోరుతూ తీర్మానించబడింది. దీనికొరకై రు. 66.6 వేలు మంజూరు చేయబడినవి. రు. 1.10 లక్షలు క్రొత్త రహదారుల నిర్మాణంకొరకు పంచాయతీ సమితి మరియు నాన్ పంచాయతీసమితి ప్రాంతాలలో ఖర్చుచేయుటకు కూడా మంజూరి ఇవ్వబడింది

హనుమకొండలో శిశు సంక్షేమ కేంద్రం

అఖిల భారత మహిళా సమ్మేళనపు వరంగల్ శాఖ సర్వసభ్య సమావేశం హనుమకొండలో జరిగి క్రింది కార్యవర్గం ఏకగ్రీవముగా ఎన్నుకోబడింది:

ముఖ్యాధ్యక్షులు (పేట్రన్) శ్రీమతి అక్బరీషబ్బీర్, అధ్యక్షులు: శ్రీమతి కె. పి. రెడ్డి, ఉపాధ్యక్షులు; శ్రీమతులు; గయాసొద్దీన్, జాల్ నూరియా; ప్రధాన కార్యదర్శిని: శారదాబాయి వెంకటస్వామి, సహాయ కార్యదర్శిని: కోశాధ్యక్షులు: యం. సత్యాదేవి, ఆచార్య. శ్రీమతులు కె, కనక రత్నమ్మ జిల్లాకాంగ్రెసు అధ్యక్షురాలు, అజల్ సింగ్, ఐ, వెంకట్రావు, హనుమంతరావు, ఖురేషి, పి. గోవింద కృష్ణయ్య మరియు టి. లక్ష్మీ నారాయణ కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోబడినారు.

ఈ సమావేశం హనుమకొండలోని రెడ్‌క్రాస్ భవనాలలో ఒక శిశు సంక్షేమ కేంద్రాన్ని నెలకొల్పుటకు తీర్మానించినది. ఈ శిశుకేంద్రం ఈనెలచివరి వారంలో ప్రారంభించబడగలదట.

ప్రధాన కార్యదర్శిని శ్రీమతి శారదాబాయి గారు ఒక ప్రకటనలో వరంగల్ ప్రజలు ఈమంచిపని కొరకు తమకుతోచిన ధనసహాయం చేయాలని కోరారు. యీ సంఘం మూడు ఉప సంఘాలుగా ఏర్పడి సమాజ వికాసం కొరకు పనిచేయగలదని కూడ తెలిపినారు.

వరదలు వర్షాకాలంలో సామాన్య సమస్యగా మారుతున్నవి. బిహార్‌లో ఒకచోట వరదల నిరోధానికి దుంగలు ఇసుకతో బస్తాలతో వరదకట్ట కడుతున్న దృశ్యం.

సంగీతం విశ్వజనీనభాష

అమెరికన్ సంగీత విద్వాంసుని అభిభాషణ

మద్రాసు, జులై 21

సంగీతాన్ని ఆనందించడానికి దానిని గురించి వివరాలు తెలుసుకోనవసరం లేదు. అదివిశ్వజనీనభాష. దానికిఆత్మార్పణమైన వారందరికి అది ఏదో ఒక సందేశం ఇస్తూంటుంది" అని ప్రముఖ అమెరికన్ పియానిస్టు అయిన శ్రీ వాల్టర్ హాజిన్ కర్ణాటక సంగీత కళాశాలలో సోదాహరణోపన్యాసంచేస్తూ అన్నారు.

దక్షిణాది సంగీత విద్వాంసులు, ఉపాధ్యాయులు, ఆయన సూక్తితో ఏకీభవిస్తారనడంలో సందేహంలేదు.

బాక్, హాండెల్, మోజార్ట్, బీథోవెన్‌ల గీతాలనుఆయన పియానోమీద వినిపిస్తున్నప్పుడు వారు పరమానంద పడ్డారు. పియానోను ఆయన అవర్గళంగా వాయించడం చూచి ఆశ్చర్యపడ్డారు.

తన పర్యటనోద్దేశాన్ని ఆయన వివరిస్తూ ప్రపంచ ప్రజల మధ్య సద్భావాన్ని సాధించడానికి సంగీతము అద్భుత సాధనమని శ్రీహాజిన్ విశ్వాసం. ఆసియా యువజనులకు వినిపించవలసిందని శ్రీమతి ఫ్రాంక్లిన్ రూజ్వెల్టు పంపి తనకిచ్చిన సందేశాన్ని ఆయన చదివి వినిపించారు.

కర్ణాటక సంగీత కళాశాల ప్రిన్సిపాలు శ్రీమునిరిసుబ్రహ్మణ్య అయ్యరు శ్రీహాజిన్ సంగీత ప్రావీణ్యాన్ని ప్రశంసిస్తూ, గంధర్వులు నాలుగు చేతులతోనూ ఎనిమిది చేతులతోనూ వాయిస్తారనే కథలు జ్ఞాపకానికివచ్చాయనీ, ఆయన వ్రేళ్ళు అంతసునాయాసంగా పనిచేస్తున్నాయనీ అన్నారు.

మద్రాసుయూనివర్సిటీలో సంగీత శాఖాధ్యక్షుడు శ్రీ పి. సాంబమూర్తి మాట్లాడుతూ శ్రోతలను అశలంక సంగీత మకరంద మాధుర్యములో ముంచెత్తగల మహాప్రవీణుడనీఆయన్ని ప్రశంసించారు.

ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయసంఘం

తిరిగి జులై 31 న సమావేశం

హైదరాబాద్, జులై 21

జులై 17, 18, 19, వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ సంఘం శ్రీ కె. అచ్యుతరెడ్డి అధ్యక్షతన సమావేశమయి తెలంగాణా అభివృద్ధికై శ్వేతపత్రాన్ని పరిశీలించేందుకు నియమించబడిన ఉపసంఘం నివేదికను పరిశీలించి తిరిగి జులై 31 వ తేదీకి చర్చించుటకై సమావేశాన్ని వాయిదావేశారు. జిల్లా పరిషత్తు; పంచాయతీ సమితి, గ్రామపంచాయతీల స్వపరిపాలనావికేంద్రీకరణ పైనివేదిక సమర్పించటానికి ఉపసంఘానికి మూడు నెలల గడువును ప్రాంతీయ సంఘం పొడిగించినది.

సంఘం ఏకగ్రీవంగా 1. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రీప్రొఫెషనల్ కోర్సుల ప్రవేశాలకు మల్టీపర్పస్ పరీక్ష ఉత్తీర్ణులయిన వారికి కేటాయించిన మూడవ పంటు కోటాలో సీనియర్ కేంబ్రిడ్జి పరీక్ష ఉత్తీర్ణులయిన అభ్యర్థులను కూడా చేర్చడానికి, 2, మధ్యరకం పోచంపాడు ప్రాజెక్టును తృతీయ ప్రణాళికాకాలంలో చేపట్టి పూర్తిచేయడానికి. 3. ఉస్మానియా విశ్వవిద్యాలయం హెచ్చించిన కళాశాల జీతాల సమస్యపైన, 4. జేగంపేటలో నిర్మించదలచిన సచివాలయ భవనాలసమస్య గురించి, 5, వరంగల్లు కేంద్ర ఇంజనీరింగు కళాశాలలో తెలంగాణా ప్రాంతం అభ్యర్థులకు సీట్ల కేటాయింపు పెంచడాన్ని గురించి, 6, వరంగల్ లోని ప్రాంతీయ వైద్య కళాశాలను ప్రభుత్వం తీసుకునే విషయం గురించి తీర్మానాలను ఆమోదించింది,

ప్రభుత్వభూమి కేటాయింపు విధానాన్ని గురించి, తెలంగాణాలోని మునిసిపాలిటీల ఆక్టాయ్ పన్ను విధింపును గురించిన తీర్మానాలను పరిశీలనార్థం ఆయా ఉపసంఘాలకు పంపారు.

లెఫ్టినెంట్ కర్నల్ గౌరవ హోదాలు

న్యూఢిల్లీ, జులై 21

బరోడా మహారాజు శ్రీ ఫతేసిన్హా గయక్వార్‌కు, సవంత్‌వాడి రాజు శ్రీ శివరామ్ సవంత్ భోస్లేకు భారత సైన్యంలో లెఫ్టినెంటు కర్నల్ గౌరవ హోదాలను రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మంజూరు చేశారని ఒక పత్రికా ప్రకటనలో భారత రక్షణ మంత్రిత్వశాఖ తెలియచేసింది.

కార్మిక సంఘం నమోదు

హైదరాబాదు, జులై 21

కార్మిక సంఘాల చట్టం క్రింద హైద్రాబాదుజిల్లా వ్యవసాయకూలీల సంఘం కార్మిక నమోదు చేయబడినది. శ్రీ కె. బి. సుదర్శనం, శ్రీ పి. జీవరత్నం, అధ్యక్ష కార్యదర్శులు.

ప్లవ సం॥ ఆషాఢ శు॥ నవమి
సా. 4-45 స్వాతి ఉ 9-20
ప. వ. 12-56 మొ: 4-32 వరకు
(శాలివాహన శకము: 31-4-1883)
22-7-1961 శనివారము

"నిను నెఱుఁగకున్న సంసార నిమగ్నత వోదు గోచరము గావు మనంబునకు నఖలేంద్రియములకు ననునేమను వాడవింక నారాయణుఁడా."

— భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 35280

22 జులై 1961

శనివారము

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధి

ఈ వారము పత్రికలలో ప్రకటితమైన వార్తలప్రకారము హైదరాబాద్ పద్దనున్న రామచంద్రపురములో భారీ విద్యుత్పరికరాల కర్మాగారమును నెలకొల్పుటకు భారత ప్రభుత్వము నియమించిన సాంకేతిక సంఘము సిఫారసు చేసినట్లు తెలియుచున్నది. ఈ సిఫారసును భారత ప్రభుత్వము ఆమోదించగలదని విశ్వసించుచున్నాము. మరొకవార్తప్రకారము హైదరాబాదు జిల్లాలోని నాచారం గ్రామములో రసాయనిక ఎరువుల కర్మాగారము నెలకొల్పుటకు నిశ్చయించినట్లు తెలియుచున్నది. కొన్నివారాల క్రింద హైద్రాబాదు నగర పరిసరాలలో అలారం గడియారాల ఫ్యాక్టరీ నిర్మాణమునకు శంకుస్థాపన జరిగినది. నవంబర్ నెలలో రెండు చక్కెర ఫ్యాక్టరీలుకూడ స్థాపితము కాగలవని తెలియుచున్నది. కొంచెము ఆలస్యముగనైనప్పటికిని, ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికాభివృద్ధిని గూర్చి కేంద్రప్రభుత్వము కొంత శ్రద్ధ తీసికొనినట్లు కనుపించుచున్నది. మొదటి రెండు ప్రణాళికలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమున పారిశ్రామికాభివృద్ధికై యెటువంటి శ్రద్ధ తీసికొనబడలేదు. మూడవ ప్రణాళికలో పూర్వము జరిగిన అన్యాయమును నివారించుటకు కావలసిన యేర్పాటులు జరుగవలసి యుండును.

ఈ వారము హైదరాబాదు నగరానికి భారతప్రభుత్వవాణిజ్య పరిశ్రమలశాఖమంత్రి శ్రీ కె.సి. రెడ్డిగారు విచ్చేసినారు. ఆంధ్రప్రదేశ్ వాణిజ్య మండలి వారి గౌరవార్థము చేసిన విందులో శ్రీ రెడ్డిగారు గావించిన ప్రసంగము గమనించదగి యున్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమునకు రెండులక్షల కదుళ్ళు మంజూరు చేసి, వస్త్ర పరిశ్రమకు కావలసిన సదుపాయాలను గావించగలమని శ్రీ రెడ్డిగారు ఉద్ఘాటించినారు. మన రాష్ట్రములో రెండు సిమెంటు ఫ్యాక్టరీలు స్థాపితము గావలెనని గూడ ఈసందర్భమున కె.సి. రెడ్డిగారు తెలియజేసినారు. ఈ రెండు ఫ్యాక్టరీలకు భారత ప్రభుత్వము లైసెన్సుల నిచ్చినట్లు గూడ వారు వెల్లడి జేసినారు. ప్రస్తుతము దేశములో సిమెంటుకొరత చాల యెక్కువగా నున్నది. స్వయముగా మంత్రిగారు యిచ్చిన అంకెల ప్రకారము సిమెంటుఅవసరాలు నూట నలుబది లక్షల టన్నుల వరకు ఉండగా ప్రస్తుతము అందులో సగము మాత్రమే ఉత్పత్తి యగుచున్నది. ఈ కొరతను నివారించుటకు రాబోవు రెండు మూడు సంవత్సరాలలో కొన్నికొత్త లైసెన్సులను యివ్వవలసి రాగలదని మంత్రిగారు వివరించినారు. ఇప్పటి వరకు యిచ్చిన రెండు లైసెన్సులు ఉపయోగించబడి యీ రెండు సిమెంటుఫ్యాక్టరీలు సత్వరముగా స్థాపితము కాగలవని విశ్వసించుచున్నాము.

మంత్రిగారి ప్రసంగములో నదీజలాల వివాదమును గూర్చి గూడ ప్రస్తావించి ఆంధ్రప్రదేశ్‌లో జల విద్యుత్ ప్రాజెక్టుల పని చక్కగా జరుగుటకొరకు యీ వివాదము సత్వరముగా పరిష్కారము కావలెనని సూచించినారు. వారు కొంతకాలము క్రింద హైద్రాబాదునకు వచ్చినప్పుడు యీ విషయమై చేసిన ప్రకటన వివాద పరిష్కారానికి ప్రయోజనకారిగా నుండలేదు. స్వయముగా మంత్రిగారు కర్ణాటక రాష్ట్రమునకు జెందినవారు. ఆంధ్రప్రదేశ్ అవసరాలకు భంగము కలుగనిరీతిగా యీ వివాద పరిష్కారానికి వారు కృషి చేయగలరని ఆశించుచున్నాము. మన రాష్ట్రములో వారుఉండిన రెండు రోజులలో ఆంధ్రప్రదేశ్ అవసరాలను వారు చక్కగా అవగాహన చేసికొనియుందురు. అందుచేత గూడ ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను గమనించి మైసూరు ప్రభుత్వ విధానము ఈ ప్రయోజనాలకు భంగకరము కానిరీతిగా వారు కృషి చేయగలరని విశ్వసించుచున్నాము.

మంత్రిగారు గావించిన ప్రకటనలో గమనించదగిన మరొక సంగతి చిన్నతరహా పరిశ్రమలను గూర్చిన వారి యభిప్రాయము. పంజాబురాష్ట్రములో భారీ పరిశ్రమలు లేకపోయినప్పటికిని, తలసరి ఆదాయము యెక్కువగా నున్నదనియు, బీహారు రాష్ట్రములో భారీపరిశ్రమలు యెక్కువగా ఉన్నప్పటికిని తలసరి ఆదాయము తక్కువగా నున్నదనియు తెలిపి, దేశ ఆర్థికాభివృద్ధికి చిన్నతరహా పరిశ్రమల ప్రాధాన్యమును వారు వివరించినారు. చిన్నతరహా పరిశ్రమల విషయములో గూడ ఆంధ్రప్రదేశ్ చాల వెనుకబడి యున్నది. ఈ సత్యమును స్వయముగా మంత్రిగారు ఆంధ్రప్రదేశ్‌లో పాల్గొనిన సభలయందు ఒప్పుకొని యున్నారు ఆంధ్రప్రదేశ్‌నకు ఒక ఉక్కు ప్లాంట్ గూడ లభించవలసిన అవసరమును కె.సి. రెడ్డి గారు గుర్తించి తమ ప్రసంగములో తెల్పినారు. వాణిజ్య పారిశ్రామిక శాఖలకు అధ్వర్యమువహించుచున్న శ్రీ రెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ అవసరాలపట్ల యెక్కువ సానుభూతిని ఆచరణలో ప్రకటించ గలరని మేము ఆశించుచున్నాము.

శ్రీ కె.సి. రెడ్డి గారు చేసిన ప్రసంగములో ఆంధ్రప్రదేశ్‌లో అరువది పరిశ్రమలను స్థాపించుటకు లైసెన్సులను యిచ్చినట్లును కాని యిప్పటివరకును ఆ పరిశ్రమలు స్థాపితము కానట్లును తెలియజేసినారు. అంతేకాదు, ఈ పరిశ్రమల స్థాపనకు సహాయము చేయుటకు భారతప్రభుత్వము సంసిద్ధముగా నున్నట్లు రెడ్డిగారు వివరించినారు. ఈవిధముగా లైసెన్సులు యీయబడిన పరిశ్రమలు యేమిటో తెలియదు. లైసెన్సులను యిచ్చి యెంతకాలమైనదో, పరిశ్రమలు స్థాపితము కాకపోవుటకు కారణములు యేమిటో తెలియదు. ఈవిషయమై పరిశీలన జరుగగలదని ఆశించుచున్నాము. పరిశీలన ఫలితముగాలైసెన్సులనుయిచ్చిన యీ పరిశ్రమలు సత్వరముగా స్థాపించబడి ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి తోడ్పడి, నిరుద్యోగ నిర్మూలనమునకు ఉపయుక్తము కాగలవని ఆశించుచున్నాము.

కమ్యూనిస్టు పార్టి వైఖరిలో మార్పు!

చైనా ఆక్రమిత ప్రాంతాలు భారతదేశానికి చెందినవేనని అహ్మదు ప్రకటన

లక్నో, జులై 21

చైనా అక్రమంగా ఆక్రమించుకున్న భారత భూభాగంలోని ప్రత్యంగుళాన్ని కాపాడడానికి కమ్యూనిస్టులు నిర్ణయించుకున్నారని భారత కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు డా॥ జడ్.ఏ. అహ్మద్ (ఎం.పి.)నిన్న తెలిపారు

తూర్పున మక్ మోహన్ రేఖ' పశ్చిమాన లడఖ్-భారత సరిహద్దులు ఇండియా సరిహద్దులుగా భారతప్రభుత్వము పేర్కొన్న మేరకు కమ్యూనిస్టుపార్టీ అంగీకరించుతున్నట్లు కూడా ఆతడు తెలిపాడు. చైనా చర్యను "దురాక్రమణ"అని తాము పేర్కొనబోమనీ ఉభయదేశాలమధ్య తీవ్ర యుద్ధపరిస్థితి ఏర్పడితేనే అది దురాక్రమణగా చిత్రించాల్సి ఉంటుందనీ అహ్మద్ అన్నాడు.

చైనా ఆక్రమించుకున్న భాగం భారత భూభాగమేననీ శాంతియుత పద్ధతులద్వారా ఈసమస్య పరిష్కారమౌతుందనీ కమ్యూనిస్టుపార్టీ భావిస్తున్నట్లు అహ్మద్ పేర్కొన్నాడు. కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయదృష్టిఅంటే జాతీయ ప్రయోజనాన్ని భంగపరచడం కాదనీ భారతదేశం కమ్యూనిస్టుపాలనలో ఉన్నప్పటికీ భారత భూభాగం చైనా ఆక్రమించుకుంటే ఊరుకోమనీ జడ్.ఏ అహ్మద్ స్పష్టపరిచాడు.

సరిహద్దు విషయంలో భారత ప్రభుత్వ విధానాన్ని ప్రధానినెహ్రూ ధోరణిని కమ్యూనిస్టుపార్టీ సమర్థిస్తున్నదని ఆతడన్నాడు. జాతీయ దృష్టితో చైనా చర్య దురాక్రమణఅని పేర్కొంటామనీ అంతర్జాతీయ దృష్టితో ఆసమస్య శాంతియుత పరిష్కారాన్ని కోర్తామనీ అహ్మద్ అన్నాడు.

శ్రీఆర్. కె. నెహ్రూ వివరణ

మాస్కో, ఉఎన్ బాటార్, పెకింగ్ పాంగైల పర్యటన పూర్తి చేసుకొని గత రాత్రి ఢిల్లీచేరిన భారతవిదేశాంగ ఉన్నత కార్యదర్శి శ్రీఆర్. కె. నెహ్రూ చైనా దురాక్రమణ తొలగనంత వరకూ ఉభయదేశాలమధ్య స్నేహాపొసగదని చైనా నాయకులతో స్పష్టపరిచి వచ్చానని ప్రకటించారు. తాను పెకింగ్ చర్చల్లో సరిహద్దు సమస్యపై చైనాతో సంప్రదింపులంటూ ఉండవని చెప్పానన్నారు. చైనా నాయకులు తాము స్నేహ సంబంధాల్నే కోరుతున్నట్లు చెప్పారని శ్రీ ఆర్. కె. నెహ్రూ అన్నారు.

నేడు ప్రధాని నెహ్రూను కలిసి ఆయన తన చర్చల వివరాల్ని నివేదిస్తారు.

చెస్టర్ బౌల్స్ పర్యటన

ఆసియా, ఆఫ్రికా దేశాలలో జులై 31 నుంచి

వాషింగ్టన్, జులై 21

వైట్‌హౌస్‌లో ప్రెసిడెంట్ కెనెడి విదేశాంగశాఖ అండర్ సెక్రటరీ చెస్టర్ బౌల్స్ ఆఫ్రికా మధ్య పాచ్యం దక్షిణాసియా దేశాలలో వచ్చేవారం ప్రారంభం కానున్న బౌల్స్ పర్యటన గురించి సంప్రదింపులు జరుపుకొన్నారు.

శ్రీ బౌల్స్ 18 రోజుల పర్యటనకు జులై 24న బయలుదేరుతారు. శ్రీ బౌల్స్ ఈ పర్యటనసందర్భంలో లాగోస్, నికోసియా, న్యూఢిల్లీలలో ఆయా ప్రాంత దేశాలలోని అమెరికా రాయబారుల సమావేశాలు జరుపుతారని శ్రీ శాలింజర్ చెప్పారు. ఆయా దేశాలలోని అమెరికన్ రాయబారులతో పాటు వారి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు కూడా పాల్గొనే యీ సమావేశాలు సర్వసాధారణమైనవే నన్నారాయన.

చైనాలోని భారత రాయబారి

లండన్, జులై 21

చైనాలోని భారత రాయబారి జి. పార్థసారథి ఆతని సతీమణి నిన్న భారతదేశానికి బయలు దేరారు.

నాటక బృందాలకు సహాయక పథకం

హైదరాబాదు, జులై 21

1960 సంఘాల నమోదు (XX1) చట్టము క్రింద నమోదు చేయబడిన నాటక బృందాలకు కేంద్ర శాస్త్రీయ పరిశోధన, సంస్కృతీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ గ్రాంటులను మంజూరు చేస్తుంది. గత ఐదేండ్లలో కనీసము మూడు విడి నాటకాలను నిర్మాణముచేసి, 1960 క్యాలెండరు సంవత్సరములో 50 కు తక్కువ గాకుండా ప్రదర్శనలిచ్చిన బృందానికి యీ గ్రాంట్లు లభిస్తాయి. ప్రత్యేక విషయాలతో రెండవ పరతును సడలించే అవకాశము వుంది. ఈగ్రాంట్లు కొత్త నాటకాలను నిర్మించి ఆడటానికి ఇస్తారు.

వివరాలు:-

1. ఒక నాటకానికి గ్రాంటు రు. 7500 లు 2. 1961-62 సంవత్సరములో రెండు నాటకాల కంటె ఎక్కువ నిర్మాణము చేయడానికి ఏ ఒక్క బృందానికి గ్రాంటు ఇవ్వబడదు. మొదటి నాటకానికి ఇచ్చిన గ్రాంటును వినియోగించిన తర్వాతనే రెండవ నాటకానికి గ్రాంటు దొరుకుతుంది. 3. ఈ గ్రాంటు పిలయినంత వరకు అన్ని ప్రాంతీయ భాషలలోని నాటకాలను పరిశీలించిన మీద ప్రాంతీయ పద్ధతిపై ఇవ్వడము జరుగుతుంది.

ఈ పథకము క్రింద ఆర్థిక సహాయం పొందే నిర్మాతలు అపకీర్తికి, మతం, భాషా సంబంధమైన దుష్ప్రచారానికి దూరమయిన నాటకాన్ని వేస్తామని పూచీ ఇవ్వాలి. కాపీరైటు హక్కుల భంగానికి ప్రభుత్వము బాధ్యత వుండదు. గ్రాంటు మొదటి దఫా అందిన తేదీలగాయతు ఆరునెలలలోగా నాటకాన్ని ప్రదర్శనకు సిద్ధము చేసే హామీ ఇవ్వాలి. అలా చేయనియెడల ఇచ్చిన గ్రాంటును ప్రభుత్వానికి వాపసు చేయవలసి వుంటుంది.

నాటకము ఒకటి సిద్ధముచేసి ఇరవైకు పైగా ప్రదర్శన లిచ్చినట్లు రాష్ట్ర ప్రభుత్వము నుండి పొందిన సర్టిఫికెట్ చేరగానే మొదటి దఫా రు. 3500 లు చెల్లించబడుతాయి.

దరఖాస్తులన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలద్వారా కేంద్ర శాస్త్రీయ పరిశోధన, సంస్కృతీ వ్యవహారాల (సంస్కృతీ విభాగము) మంత్రిత్వ శాఖ పేర పంపాలి. అందులో తెలియపరచవలసిన వివరాలు:-

1. దరఖాస్తుదారుని పూర్తి పేరు, చిరునామా 2. రిజిస్ట్రేషన్ తేదీ, నంబరు 3. సంఘం మెమో, నియమ నిబంధనలు 4. ఆడిటర్ రిపోర్టు, ఆడిట్ చేయబడిన గత సంవత్సరపు ఆదాయ వ్యయాల పట్టిక, నడిచే సంవత్సరానికి బడ్జెటు అంచనాలు. 5. నాటక బృందం సభ్యులపేర్లు వారి యోగ్యతలు, వారు పొందే పారితోషికాలను చూపే స్టేటుమెంట్. 6. నిర్మాణం చేసే నాటకము గురించిన పూర్తి వివరాలు. 7. నాటకాన్ని ఎక్కడ, ఎప్పుడు సమర్పించదలచారు. 8. ఇంతవరకు నిర్మాణము చేసిన నాటకాల సంఖ్య, గత ఐదేండ్లుగా ప్రదర్శించిన నాటకాలు. 9. 1960లో ఇచ్చిన ప్రదర్శనల సంఖ్య.

దరఖాస్తులు ఆగస్టు 20 వ తేదీలోగా సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శికి పంపాలి.

ఆగస్టు 5, 6 తేదీలలో ప్రాగాటూల్స్ వార్షిక సమావేశం

హైద్రాబాద్, జులై 21

ప్రాగాటూల్స్ కార్మికుల సంఘ వార్షిక సమావేశం ఆగస్టు 5, 6 తేదీలలో జరుగుతుంది. శ్రీ వి. వెంకటరామన్ (ప్రాగాటూల్స్ జనరల్ మేనేజర్) ఆగస్టు 5న ఉదయం 10 గంటలకు ప్రతినిధుల సమావేశాన్నారంభిస్తారు. 6 న సాయంత్రం 4 గంటలకు కార్మిక మంత్రి శ్రీరామచంద్రారెడ్డి ఓపెన్ సెషన్‌ను ప్రారంభిస్తారు. ప్రాగాటూల్స్ కార్మికుల సంఘాధ్యక్షులు శ్రీ ఎన్. సత్యనారాయణరెడ్డి అధ్యక్షత వహిస్తారు. ఓపెన్ సెషన్‌లో శ్రీయుతులు మక్దూం మొయినొద్దీన్, డా॥ రాజ్‌బహద్దర్ గౌడ్ ఎం.పి. తదితరులు ఉపన్యసిస్తారు.

శ్రీకాకుళం జిల్లా బృహత్ ప్రణాళిక

హైద్రాబాదు, జులై 21

1961 జూన్ 12వ తేదీన శ్రీకాకుళంజిల్లా గ్రామపంచాయతీ అధ్యక్షుల సమావేశానికి శ్రీకాకుళంలో శ్రీ ఎన్. సంజీవరెడ్డి ప్రారంభోత్సవము చేశారు. ఆరోగ్యశాఖా మంత్రి శ్రీ పి. వి. జి. రాజు సమావేశానికి అధ్యక్షత వహించారు. పి. డబ్ల్యు. డి. మంత్రి శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు, ఆర్థికమంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి సమావేశంలో మాట్లాడారు.

శ్రీకాకుళంజిల్లా పరిషత్ అధ్యక్షులు శ్రీ బి. కూర్మన్న, ఎం.ఎల్.సి. జిల్లా సర్వతోముఖాభివృద్ధికయిరు. 55 కోట్లు బృహత్ ప్రణాళికను సమావేశంలో ప్రవేశపెట్టారు. యీ ప్రణాళికకు గడువు పదేండ్లు సూచించబడింది.

యువకర్షక సంఘం

1961 జూన్ 18వతేదీన కేంద్ర వ్యవసాయమంత్రి శ్రీ పంజాబ్‌రావు దేశ్‌ముఖు శ్రీకాకుళం జిల్లా యువ కర్షక సంఘ వార్షిక సమావేశానికి సర్వన్న సేటలో ప్రారంభోత్సవము చేశారు. పరిపంటలో రాష్ట్ర మొదటి బహుమతి నందుకున్న శ్రీ కె. సుబ్బయ్య నాయుడు సమావేశానికి అధ్యక్షత వహించారు. అఖిలభారత యువ కర్షక సంఘం ప్రధానకార్యదర్శి శ్రీ బాసు సమావేశంలో మాట్లాడారు.

శ్రీ పంజాబ్‌రావు దేశ్‌ముఖు, పోలీసులో యువకర్షక సంఘం కార్యాలయ భవనానికి ప్రారంభోత్సవము చేశారు.

శ్రీ దేశముఖు అనాథనిలయాన్ని సందర్శించారు. కలెక్టరు శ్రీ జి. హెచ్. అన్సారీ అధ్యక్షతన సభ జరిగినది. 10 సాంఘిక సేవా సంఘాల తరపున కేంద్రమంత్రికి స్వాగత పత్రాలు సమర్పించబడినవి.

1961 జూన్ 17వ తేదీన ప్రాథమిక విద్యా వారోత్సవ సంఘం,జిల్లా పరిషత్ ఆఫీసులో జిల్లాపరిషత్ అధ్యక్షులు శ్రీ బి.కూర్మన్న,ఎం.ఎల్.సి., అధ్యక్షతన సమావేశమైంది. ఆనాటి నుంచి జూన్ 28వరకు జిల్లా అంతటా వారోత్సవాలు జరుపబడ్డాయి. జూన్ 25వ తేదీ శ్రీకాకుళం జిల్లా పరిషత్ ఆఫీసులో జిల్లా సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుల వార్షిక సమావేశం జరిగింది. జిల్లా పరిషత్ అధ్యక్షుడు అధ్యక్షత వహించారు. జిల్లాలో కొత్తగా నెలకొల్పబడిన 36 మాధ్యమిక పాఠశాలలతో, ఇప్పుడు 120 సెకండరీ పాఠశాలలు అయినవి. ఈ 36 కొత్త మాధ్యమిక పాఠశాలలలో 7 జాలికలకు 12 మంది విద్యార్థులతో ఒక ప్రభుత్వ పాలిటెక్నిక్ శ్రీకాకుళంలో పాత కళాశాల భవనంలో తెర్చారు. ఇందులో మూడుకోర్సులు- సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్. ఉంటాయి. ఒక్కొక్క దానిలో 40 సీట్లు కేటాయించారు.

ప్రభుత్వ ఆర్ట్సు కళాశాల దానికై ఉద్దేశించిన భవనంలోకి మార్చబడి. జూన్ 26వ తేదీనుంచి పని చేయనారంభిస్తూంది.

మూడు పూర్వ విస్తరణ బ్లాకులు

1961 ఏప్రిల్ 1వ తేదీన మూడు కొత్త పూర్వ విస్తరణ బ్లాకులు మంజూరవటంతోనూ, తొలిదశ బ్లాకును రెండవదశకు మార్చటంతోనూ, రెండు పూర్వవిస్తరణ బ్లాకులు తొలిదశకు మార్చబడటంతో, జిల్లాలోని బ్లాకులు యిలా ఉన్నాయి. పూర్వ విస్తరణ బ్లాకులు 5, తొలిదశబ్లాకులు 14. రెండవదశం బ్లాకులు 5/ 24 పని చేస్తున్న 24 బ్లాకులలో 17 పంచాయతీ సమితి బ్లాకులు; జిల్లాలో యింకా 160ప్రాంతాలుబ్లాకులు ఏర్పడకుండా ఉన్నాయి.

1961 జూన్‌మాసంలో మొత్తము 14 సినిమాప్రదర్శనలు, ప్రజా సంబంధ శాఖవారు ప్రదర్శించారు, 8,300 మంది వీటిని తిలకించారు. సమాచార శాఖలోని ప్రచార విభాగం 1960.61 లో యీ జిల్లాలో 125 కమ్యూనిటీ రేడియో సెట్లు నెలకొల్పారు.

కోయిలిలో నూనె శుద్ధి కర్మాగారం

ఇంధన తైలం ఖనిజ వాయువు కమిషన్ నిర్ణయం

న్యూఢిల్లీ, జులై 21

గుజరాత్‌లో పబ్లిక్ సెక్టర్ లో ఏర్పరచబడే 2 మిలియన్ టన్నుల నూనె శుద్ధికర్మాగారాన్ని కోయలిలో ఏర్పరచాలని ఆయిల్ మరియు నేచురల్ గ్యాస్ కమిషన్ నిర్ణయం చేసింది. ఇది బరోడాకు 10 మైళ్ళదూరంలో కలదు. దీనికి బాబ్బాయ్ రైల్వే స్టేషన్ దగ్గరిలో ఉన్నది. దీనికి సమీపంలోనే మహీసాగర్ నది ప్రవహిస్తున్నది.

స్త్రీ ఆత్మహత్య

జహీరాబాద్, జులై 21

మద్నూర్ గ్రామంలో రత్నమ్మ అను స్త్రీ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. గృహఛిద్రాల కారణముగా ఈమె ఇట్టి అఘాయిత్యానికి పాల్పడినది.

భారతదేశం, మొరాకోల వర్తక సంప్రదింపులు

న్యూఢిల్లీ, జులై 21

మొరాకోకు చెందిన నలుగురు సభ్యుల ప్రతినిధివర్గం, భారతప్రభుత్వ అధికారుల మధ్య జరుగుతున్న వర్తక సంప్రదింపులు ముగిశాయి. ఉభయ దేశాలమధ్య ఒక వాణిజ్య ఒప్పందాన్ని 1961 ఆగస్టు 1 నుంచి అమలులోకి తెస్తూ అధికార పత్రంపై సంతకాలు జరిగాయి.

మొరాకో ప్రతినిధివర్గం నాయకుడు శ్రీ ఎ. లామ్రానీ, భారత ప్రభుత్వ వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ బి. యస్. అడార్కర్ ఆ పత్రంపై సంతకాలు చేశారు. ఇంతకు ముందు కంటె హెచ్చు మొత్తంలో పరస్పరం సరుకులను పంపుకోవడానికి ఈ ఒప్పందం అవకాశం కల్పిస్తున్నది. భారత దేశపు పచ్చతేయాకు ఎక్కువగా ఎగుమతి అవుతుంది. డీసెల్ ఇంజన్లు, విద్యుచ్ఛక్తి పరికరాలు, భారత దేశం ఎక్కువగా ఎగుమతి చేస్తుంది. భారతదేశం ఫాస్ఫేట్లు, సీసం, జీలుగ రెండు దేదిగుమతి చేసుకుంటుంది.

1960లో ఇండియా 48 లక్షల విలువగల సరుకులను మొరాకోకు ఎగుమతిచేసింది. 52 లక్షలరూపాయల విలువగల సరుకులను దిగుమతి చేసుకుంది.

భారత సముద్ర గర్భ పరిశోధన

వచ్చే వసంతకాలము నుండి స్కీము అమలు

బొంబాయి, జులై 21

హిందూ మహా సముద్ర ప్రాంతములో పరిశోధనల జరిపేందుకు 60 మిలియన్ డాలర్ల స్కీము కలదు. దీనిని ప్రపంచపు 25రాజ్యాలు అమలు జరుపుతున్నాయి. ఇందులో ఇండియా, రష్యా, యునైటెడ్ స్టేట్సు, బ్రిటన్‌లు కలవు. వచ్చే వసంత కాలములో ప్రారంభించబడేఈస్కీము 1964 లో పూర్తి అవుతుంది.

బ్యాంకులు, ఇన్స్యూరెన్సు కంపెనీలు

ఐక్య అరబ్ రిపబ్లిక్‌లో జాతీయీకరణ

కైరో, జులై 21

ఐక్యఅరబ్ రిపబ్లిక్‌లోని రెండు రాష్ట్రాలగు ఈజిప్టు, సిరియాలలోని అన్ని బ్యాంకులు ఇన్స్యూరెన్స్ కంపెనీల జాతీయం చేస్తూ ప్రెసిడెంట్ నాసర్ నిన్న ఉత్తర్వు జారీచేశాడు.

ఇట్టి సంస్థలు ఈజిప్టులో 76, సిరియాలో 25 ఉన్నాయి.

భారతదేశంలో మిర్చిపంట

1960-61వ సంవత్సరపు అంతిమ అంచనాలు

న్యూఢిల్లీ, జులై 21

భారతదేశంలో 1960-61 లో 1,492,000 ఎకరాలలో మిర్చిపంట వేయగా, 333,000 టన్నుల మిర్చి పండినదనీ, 1959-60లో 1,472,000 ఎకరాలలో ఈ పంట వేయగా 337,000 టన్నులు పండినదనీ, దానితో పోలిస్తే 1960-61లో అదనముగా 20 వేల ఎకరాలలో వేయడం, 26 వేల టన్నుల పంట పండినదనీ కేంద్ర ఆహార వ్యవసాయ మంత్రిత్వశాఖకుచెందిన ఆర్థిక, గణాంక వ్యవహారాల డైరెక్టరు కార్యాలయం ఒక పత్రికా ప్రకటనలో తెలియచేసింది.

ఆ ప్రకటనలో యింకా యిలా వుంది. మిర్చిపంటవేసిన భూమివైశాల్యం మొత్తంమీద పెరిగినది. రాజస్థాన్, పంజాబు రాష్ట్రాలలో నాతావరణ పరిస్థితులు అనుకూలముగా వున్నందున ఎక్కువ ప్రాంతం లోనూ ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మైసూర్‌లలో వ్యతిరేకంగా వున్నందున తక్కువ ప్రాంతంలోనూ యీ పంట వేశారు.

ఢిల్లీకి ఇద్దరు బిహార్ డాక్టర్ల ప్రయాణం

పాట్నా, జులై 21

గత ముప్పది సంవత్సరాల నుండి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు వైద్యులుగా పనిచేస్తున్న ఇద్దరు ప్రఖ్యాత బిహార్ వైద్యులు డాక్టర్ టి. ఎన్. బెనర్జీ, డాక్టర్ రఘునాథ శరణ్ నిన్న ఢిల్లికి వెళ్లారు. వీరిరైతు ఢిల్లీనుండి పిలుపు వచ్చినది.

జహీరాబాదులో నాసారానే రాలు

జహీర

వాణిజ్య వ్యాపారాలు

మెసర్స్ కల్వ సూర్యనారాయణ
ఉస్మాన్‌గంజ్ కమిషన్ ఏజంటు
ఫోన్ నెం. 4412
హైదరాబాద్, జులై 21
(క్వింటల్ ధరలు)

క్వింటల్ అంటే 100 కిలో గ్రాములు	
పాలకుర్లు బియ్యం	57-50 62-00
గుజ్జులు ..	61-00 63-00
నెం 19 నెంబర్లు	59-000 61-50
దొడ్డు బియ్యం	55-00 56-50
గర్కులు	54-0 55-00
నానకరాంలు	61-00 63-00
బంగారుతీగెలు	65-00 67-00
గొట్టెబియ్యం	50-00 52-50
24 నెంబర్లు	65-00 67-00
ఎస్.కె.కె. బియ్యం	64-00 66-00
కొత్త సాంబర్లు	67-00 74-50
పాతసాంబర్లు	69-00 77-00
కుసుమబియ్యం	59-50 61-50
పచ్చకొన్నలు	82-00 84-00
పచకొన్నలు	83-00 87-00
తెల్లకొన్నలు	38-00 41-00
వసువు	120-00 125-00
కందులు పెద్దవి	40-00 43-00
కందులు చిన్నవి	35-00 38-00
మినుములు	50-00 57-00
సెనగలు	44-00 47-00
పెసలు	48-00 53-00
పులవలు	35-25 35-50
బెల్లం	24-00 38-00
మిరపకాయలు	85-00 125-00
చింతపండు	67-00 92-00
పుల్లిగడ్డ	27-00 31-00
యెల్లిగడ్డ	53-00 72-00
తెల్ల నువ్వులు	145-00 161-00
ఆముదాలు	67-00 69-00
ధనియాలు	84-00 90-00
కుసుమలు	51-00 55-00
యిలాతివల్కు పెద్దది	120-00 123-00
యిలాతికాయ నం॥1కి	82-00 90-00

టార్పాలిన్స్
వర్షాకాల భద్రతకు లభింపగలవు
DAISY TRADING CORPORATION,
Post Box No. 3185,
BOMBAY- 3,
Gram: 'Prooftalp',
Tel. C/o. 20757

ఆకాశవాణి

హైదరాబాదు-ఎ

ఆదివారం, జులై 23

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాత్, 6-35 భక్తి రంజని (విజయవాడనుండి రిలే), 6-55 కార్యక్రమ వివరణ, 7-00 తె-వా, 7-15 అమరవాణి సంస్కృత కార్యక్రమం నక్షత్రేష్టి వేదసారం, 7-30 వి.వి. శ్రీఖండే: ఖయాల్ గణ్‌కలీ, 7-45 సంగీత శిక్షణ, 8-00 అం-వా, 8-15 హిం- వా, 8-30 ఇండియన్ మార్చ్‌ట్యూన్స్, 8.35 సుబర్ద సంగీత్ 8-45 పిల్లలకు పాటలు, 9-00 "బచ్చోంకేలియే" పిల్లలకు, 9-30 ప్రసార సమాప్తి.

12-30 చిత్రజగత్, 1-00 రంగవల్లి 1-45 విరామ సంగీతం, 1-50 తె-వా 2-00 ప్రాదేశిక్ సుగమ్ సంగీత్, 2-10 ఉ-వా, 2-20 బాలవినోదం పిల్లల కార్యక్రమము, 3-00 విజయవాడ వలె, 4-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

లన్సి గోధుమలు	58.00 62-00
శర్బతి గోధుమలు	50-00 55-00
పత్తిగింజలు	81-00 87-00
కందిపప్పు	57-00 59-00
కందిపప్పు చిన్నది	52-00 54-00
సెనగపప్పు	48-00 54-00
మినుపపప్పు	78-00 76-00
పెసరపప్పు	70-00 75-00
వల్కు-నూనె 10 కిలో	22-44 22-50
కల్లిపిండి	23-75 24-00
అనుములు	35-00 42-00

ఈప్రకారము యీరోజు అయిన రలు వ్రాయించినాము. గిట్టిన సరకులు పంపవచ్చును తెప్పించుకోవచ్చును.

వెండి బంగారు ధరలు

సముద్రాల రాఘవులుగారి
చంద్రయ్య సిద్దంబర్ బజారు
ఫోన్ నెం. 4890.
హైదరాబాదు, జులై 21

బంగారము	140-50
ఆర్నోక్ చీపులు	140-50
సవరన్	94-0-0
వెండి 100 తు.	282-00
చిల్లర	2-37

గ్రామాలమార్పు

హైదరాబాద్, జులై 20

హైదరాబాదు జిల్లా చేవెళ్ళ తాలూకా నుంచి 1959 డిసెంబరు 30వ తేదీ ఉత్తర్వులో మహబూబునగరం జిల్లా షాద్‌నగరానికి మార్చబడిన యీ క్రింది 9 గ్రామాలు ఎక్సైజు పాలన వ్యవహారాల నిమిత్తం షాద్‌నగర్ ఎక్సైజు రేంజిలో చేరుస్తూ ప్రభుత్వం ఆదేశించింది. 1 తిమ్మాపురం, 2. కోతు, 3. గూడూరు, 4. ఖిల్లాపురం, 5. తీగపురం, 6. చేగూరు, మామిడిపల్లి, 9. వీరపల్లి.

జులై 28న ట్రేడ్ యూనియన్ల కౌన్సిల్ సమావేశం

హైదరాబాద్, జులై 21

నగర ట్రేడ్ యూనియన్ల కౌన్సిల్ ప్రథమ సమావేశం జులై 23వ ఉదయం 11 గంటలకు ముషీరాబాదులోని ఆర్.టి.సి. ఉద్యోగుల సంఘ కార్యాలయంలో శ్రీ మక్దూం మొయినొద్దీన్ ఎం.ఎల్.సి. అధ్యక్షతన జరుగుతుంది.

డి. ఏసు వేతనంలో కలుపాలని హైదరాబాద్ నగరాన్ని "ఏ" తరగతి నగరంగా పరిగణించాలని కేంద్ర ప్రభుత్వోద్యోగుల సంఘాన్ని గుర్తించాలని, నగరాన్ని పారిశ్రామికం చేయాలని, సమ్మెలపై, ట్రేడ్‌యూనియన్ సంస్థలపై నిషేధం విధింపగూడదని ఉద్యమమారంభించుటకు పైసమావేశం పరిశీలిస్తుంది.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 నగరవాణి: ధృవ విజయము మేలటూర్ సంగీత నాటిక, 7-00 తె-వా, 7-15 కన్నడ శ్రోతలకు చిత్ర సంగీత్, 7-30 గజేంద్రా నాటిక (ఉర్దూ) రచన: రాజేంద్రసింగ్ బేడి, 8-00 చిత్రసీమ, 8-30 డి.ఆర్.పార్వతీకర్ దత్తాత్రేయీపిణ, 9-00 అం-వా, 9-15 ఉ-వా, 9-30 ఢిల్లీనుండి రిలే, 10-00 వి. వి. శ్రీఖండే: ఖయాల్, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హయిదరాబాదు-బి

49.02 మీ (6120 కిలోసై)

ఉ॥ 6-30 హైదరాబాద్ ఎ వలె, 8-45 పాటల సావిత్రీదేవి, 9-30 ప్రసార సమాప్తి.

42.02 మీ [7140 కిలోసై]

మ॥ 12-30 హైదరాబాద్ ఎ వలె, 2-10 శాస్త్రీయ సంగీతం, 2 20 హైదరాబాద్ ఎ వలె, 4-00 వాతావరణసూచన, ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలోసై)

సా॥ 6-00 హైదరాబాద్ ఎ వలె, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె.వా 7-15 గ్రామస్థులకార్యక్రమము, 7-30 పాటల సావిత్రీదేవి, 8-00 హైదరాబాదు ఎ వలె, 9-15 శాస్త్రీయ సంగీతం, 9-30 హైద్రాబాద్ ఎవలె, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాతం, 6-35 భక్తిరంజని: త్యాగరాజ సంప్రదాయ కీర్తనలు, 6-55 ప్రసారవిశేషాలు, 7-00 తె-వా, 7-15 అమరవాణి సంస్కృత కార్యక్రమం (హైదరాబాద్ నుండి రిలే). 7-30 త్యాగరాజ కృతి సమామ్నాయం: నాగమ్మ కమల 7-45 సంగీత శిక్షణ, 8-00 అం-వా, 8-15 హిం-వా, 8-30 పాలవెల్లి చిన్న పిల్లల కార్యక్రమము పాపల్లారా రారండి సింద్‌బాద్ నావికుడు (నాల్గవ భాగం), చందమామ తోటలో-పాట చిలుక పలుకులు ఇకచాలు, 9-00 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 జంధ్యాల సత్యనారాయణమూర్తి, 1-00 నిస్సార్ హుస్సేన్ ఖాన్, ఖయాల్ తోడి, తరానా, 1-30 లలిత సంగీతం: పట్నాల అప్పారావు, 1-50 తె-వా, 2-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి

8-00 మన్నారు దాస విలాసము సంగీత నాటిక, రచన: పసుపులేటి రంగాజమ్మ రేడియో అనుసరణ; రజని నిర్వహణ: ఓలేటి వెంకటేశ్వర్లు ఇందు పాల్గొనువారు: లక్ష్మి, రత్నం సి. హెచ్. సత్యాదేవి, టి.ఎల్. ప్రసూనాంబ, పి. వి. రాజ్యలక్ష్మి, ఎం. బాలమురళి కృష్ణ, ఎం. వి. రమణమూర్తి ఎన్.సి.వి. జగన్నాథాచార్యులు, 4-15 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థులకార్యక్రమం 8-00 వాసా కృష్ణమూర్తి: వీణ వి. కమలాకరరావు: మృదంగం, 9-00 అం-వా 9-15 లలిత సంగీతం: పట్నాల అప్పారావు, 9-30 ఢిల్లీనుండి రిలే. 9-45 వాద్య సంగీతం, 10-00 జంధ్యాల సత్యనారాయణమూర్తి, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైద్రాబాదులోని నర్సుల కాలేజీ

ప్రజారోగ్యానికి ప్రాముఖ్యం

హైదరాబాద్, జులై 21

హైద్రాబాదులోని నర్సింగ్ కాలేజీ అతి కీలకమైన ప్రజారోగ్య రక్షణ రంగంలో విద్యార్థులకు సమగ్ర శిక్షణ గరపుతున్నది.

నాలుగు సంవత్సరాల (బి యస్ సి.) డిగ్రీ కోర్సులో తొలి సంవత్సరం పారిశుద్ధ్యం ప్రజారోగ్యం గురించి తీరి పాఠాలు నేర్చుకొన్న తరువాత ఈ నర్సింగు విద్యార్థులు రెండవ సంవత్సరం ప్రాక్టికల్ శిక్షణకు తయారుగా ఉన్నారు. ప్రస్తుతం ఈ విద్యార్థులు హైదరాబాదు పరిసర ప్రాంతంలో గ్రామీణ ఆరోగ్య కేంద్రాలలో ప్రత్యక్ష శిక్షణ పొందుతున్నారు.

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 169 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుఉన్నవి. తృతీయ ప్రణాళికలో ఈ కేంద్రాల సంఖ్యను 410 పైగా పెంచుతారు. ఇటువంటి కొన్ని కేంద్రాలలో యీ నర్సింగు కాలేజీ పట్టభద్రులు కీలక పాత్ర నిర్వహిస్తారు.

ఈ గ్రామీణ వైద్య కేంద్రాలు, పట్టణాలలోని ఆస్పత్రులు వ్యాధులు చికిత్సకు మాత్రమే కాకుండా ప్రజలకు ఆరోగ్య విజ్ఞానాన్ని బోధించే కేంద్రాలుగా కూడా పరిగణింపబడగలవు. కాబట్టి ఆస్పత్రులలోనూ ప్రజారోగ్య కేంద్రాలలోనూ మంచి నర్సులు కావాలంటే ప్రాక్టికల్ శిక్షణ అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రాథమిక దశలో ఆరేసి మంది శిక్షితులు ఒక బృందంగా ఏర్పడి ఒక ఇన్‌స్ట్రక్టరుతో కలిసి గ్రామీణ వైద్య కేంద్రాలకు వెళ్ళి దైనికకార్యక్రమంలో పాల్గొంటారు. వీరు ఆ వైద్య కేంద్రాలలో రోగులకు పరిచర్యలు చేయటంతోపాటు రోగుల క్లినికల్ రికార్డులు తయారుచేయటములో తోడ్పడతారు. ఆరోగ్యం, పారిశుద్ధ్యం ప్రాధాన్యత గురించి అక్కడికి వచ్చిన వారికి చెబుతారు గ్రామాలలోని రోగుల గృహాలను గూడా వీరు సందర్శిస్తారు.

రోగుల గృహాలు సందర్శించటం శిక్షితులకు ఎంతో ఉపయోగం. అందువల్ల రోగుల పరిసరాలు వారిసాంఘిక పరిస్థితులు గురించి వీరు తెలుసుకోగలుగుతారు. ఆరోగ్య పోషణ ఆహారం వంట అలవాట్లను గురించి గృహిణులకు సలహా ఇవ్వటానికి వీరికి అవకాశం లభిస్తుంది.

ఈ విధంగా ఆయా ఇండ్లలోని కొత్త రోగుల్ని కూడా వీరు కనిపెట్టవచ్చును. ఉదాహరణకు ఇటీవల ఈ శిక్షితులు వెళ్ళిన ఒక రోగి ఇంట్లో తక్షణ వైద్య చికిత్స అవసరమైన మరి ఇద్దరు రోగుల్ని కనిపెట్టారు. ఆ విధంగా వీరు అనేక మందిలో కంటి జబ్బులు, చెవిజబ్బులు పోషకాహారం లోపంవల్ల వచ్చే వ్యాధులను పసికట్టారు. ఈ వాధ్యుల నిర్మూలనకు సత్వర చర్యలు తీసుకోవలసి ఉన్నది.

1956లో స్థాపించబడిన హైదరాబాద్ నర్సింగ్ కాలేజీ రాష్ట్రంలో నర్సింగులో డిగ్రీలు ఇచ్చే ఏకైక విద్యా సంస్థ. దీని ప్రధానాధికారిణి విస్ టి. ఎ. హెచ్. ఖాన్.

...—

పౌర సంబంధశాఖచే ప్రణాళికా ప్రచారము

మహబూబ్‌నగరం, జులై 21

అభివృద్ధి ప్రణాళికలను గ్రామీణ ప్రజలలో ప్రచారము గావించుటకై 1958 సంవత్సరములో మహబూబు నగర స్థానికములో జిల్లా కార్యాలయమును ప్రచారశాఖ కార్యాలయమేర్పడి జిల్లా మొత్తములో ఆయా అభివృద్ధి బ్లాకులలో ప్రణాళిక ప్రాముఖ్యమును గూర్చి సినిమా ప్రదర్శనం ద్వారా, బుర్రకథలద్వారా ప్రచారము గావించి తన కర్తవ్యమును నెరవేర్చినది. 1960-61 సంవత్సరములో మొత్తము 60 బుర్రకథలు చెప్పబడినవి. బ్లాక్ ప్రారంభోత్సవాలలోను జాతరలయందు ఈ శాఖవారు సినిమా ప్రదర్శనలు గావించి చాలావరకు గ్రామీణ ప్రజల మన్ననల పొందినారు. ప్రణాళికల వారోత్సవాలు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిసినది. పౌరసంబంధశాఖవారి ఆధ్వర్యమున 1960 జనవరి మాసములో సమాచార కేంద్రము స్థాపించబడినది. ఈ కేంద్రము స్థానిక ప్రభుత్వ కేంద్ర గ్రంథాలయములో తన కార్యక్రమమును నిర్విరామంగా కొనసాగించుచున్నది. ఉదయము సాయంకాలములందు వందలవరకు గ్రామీణ ప్రజలు ఈ కేంద్రమునకు వచ్చుచున్నారు. పౌర సంబంధశాఖ కార్యక్రమాలు ప్రతి పంచాయతీ సమితులలో వీలునుబట్టి నిర్వహింపబడుచున్నది. పౌర సంబంధశాఖ ఏర్పడిన సంవత్సరము తర్వాత కర్మయోగి అను ఇంగ్లీషు మాసపత్రిక ప్రచురించబడుచుండెను. ప్రస్తుతము ఈ పత్రిక ఆగిపోయినది. ఈ శాఖాధికారి తన కార్యక్రమ నిర్వహణకై ప్రజలకు ప్రభుత్వాధికారులకు తగిన శ్రద్ధశ్రద్ధహించినట్లు ప్రోత్సహించుటవలన జిల్లా మొత్తములో ప్రచార కార్యక్రమము ఫలవంతముగా సాగుచున్నది. (మా. వి)

అభివృద్ధి కృషిలో సమయస్ఫూర్తి అవసరం

మద్రాసులో గాల్‌బ్రేత్ వివరణ

మద్రాసు, జులై 21

ఆర్థికాభివృద్ధి అనేది నిరంతరాయముగా జరుగవలసిన పని. ఏ దశలో ఏ విధానము అవసరమో చూచి నిర్ణయించుకొంటూ ఈ కృషి కొనసాగించుకోవాలి అని అమెరికా రాయబారి జాన్ కెనత్ గాల్‌బ్రేత్ ఇక్కడ చెప్పారు.

ఒక దేశానికి ఒక దశలో పనికి వచ్చిన విధానము మరొక దేశానికి పనికి రాకపోవచ్చును అన్నారాయన.

"కనుక అమెరికా అనుభవాలన్నీ ఇండియాకు పనికి వస్తాయనుకోవటం పొరపాటు అట్లానే ఇండియా అనుభవాలన్నీ దహోమీకి, చాద్‌కి కుడా సరిపోతాయను కోవటం పొరపాటు" అని శ్రీ గాల్‌బ్రేత్ అన్నారు.

అమెరికా రాయబారి మంగళవారమునాడు మద్రాసు వచ్చారు. ఆయన మద్రాసు యూనివర్సిటీ సెనెట్ హాలులో "ఆర్థికాభివృద్ధి విస్తృత దృష్టి" అనే అంశము మీద ఉపన్యసిస్తూ పై విధముగా చెప్పారు.

అసలు ఒక దేశములో కూడా ఒకే రకపు అభివృద్ధి విధానము సరిపోతుందనటానికి వీల్లేదు ఇండియా వంటి దేశము అభివృద్ధి సాధిస్తూ ముందుకు సాగిపోతున్న కొలదీ అభివృద్ధి సమన్వయను గురించి దాని దృష్టి మారుతుంటుంది అన్నారు శ్రీ గాల్‌బ్రేత్.

"ఆ విధముగా కాలక్రమే దా ఇంతకుముందు కంటే విదేశీ సాంకేతిక సహాయ ప్రాముఖ్యము తగ్గిపోతుందని చెప్పారు. ఇండియా సాంకేతికంతో పనిలేకుండా సాంకేతిక విజ్ఞానాన్ని ఇతోధికముగా లభింప జేసికోగలుగుతుంది" అన్నారాయన.

"ఇండియా అవసరాలకు పెట్టుబడి కీలకము కాగా, పెట్టుబడి ప్రమాణాన్ని పెంచుకోవలసిన సమస్యకు, దాన్ని వినియోగించుకొనే సామర్థ్యాన్ని పెంపొందించుకోవలసినంత ప్రాముఖ్యము ఇవ్వనవసరము లేదని చెప్పసాహసిస్తున్నాను" అన్నారు.

రెండవ ప్రపంచ యుద్ధము నాటి నుంచి ఆర్థికాభివృద్ధిని గురించి జరుగుతున్న తీవ్రచర్చను గురించి మాట్లాడుతూ రాయబారి గాల్‌బ్రేత్, దీన్ని తక్షణ కార్యక్రమముగా గుర్తించటం జరిగింది. కాగా యుద్ధానికి ముందు ఈ సమస్యను అనాసక్తతతో గుర్తించే వారు అన్నారు.

ఆఫ్రికా, ఆసియా ఖండాలలో నూతన రాజ్యాలలోనూ, పాశ్చాత్య రాజ్యాలలోనూ ఆర్థికాభివృద్ధి తప్పని సరి అని గుర్తించటము జరిగిందంటూ శ్రీ గాల్‌బ్రేత్ "ఇంకా ఎంతో తక్షణమే జరగాలనేది ఈ ఇరవయ్యో శతాబ్దపు ఆలోచన" అన్నారు.

అయితే, ఇటీవలి ఆలోచనలలో ఆర్థికపురోగతికి సంబంధించిన పరిస్థితిపై స్థూలపరిశీలన లోపిస్తున్నది. తత్ఫలితముగా వెనుకబడిన ఏ దేశములోనైనా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానము, పెట్టుబడి, సుశిక్షితులయిన మనుషులు ఉన్నట్లయితే అభివృద్ధి సుసాధ్యమనే ఆలోచనకు రావటము జరిగింది అన్నారు శ్రీ గాల్‌బ్రేత్.

ప్రపంచములో అధిక ప్రాంతంలో అభివృద్ధి సమస్యకు సంబంధించి ఇటువంటి పరిశీలన ఫలప్రదముగా ఉన్నది. పలుదేశాలలో పటిష్టమైన ప్రభుత్వము విద్య సాంఘిక న్యాయం లేకపోవటము అతి ముఖ్య సమస్యలుగా ఉన్నవి. ఈ ఆటంకాలను తొలగించుకోనిచే పెట్టుబడులు, సాంకేతిక సహాయము లభించటము కష్టము అన్నారాయన.

రాయబారి ఇట్లా అన్నారు:- "వెనుకబడిన దేశాలలో పెట్టుబడుల, సాంకేతిక సహాయము, ప్లానింగుకి ప్రాముఖ్యమిచ్చే అభివృద్ధి లోపపరిశీలనా దృష్టి కొంతవరకు పరిస్తుంది ఇండియాలో పటిష్టమైన ప్రభుత్వము ఉన్నది. ఇక్కడ ప్రజలకు చెప్పుకోదగినంత చదువు ఉన్నది. ఇక్కడ పరిపాలన, వాణిజ్య రంగాలలో నైపుణ్యము ఉన్నది. సాంఘిక న్యాయ, సాంఘిక ప్రగతి లక్ష్యాల సాధనకు నిర్దిష్ట కార్యక్రమాలున్నవి. ప్రజలలో కొనుగోలు శక్తి జాస్తిగా ఉన్నది లాభాల ప్రమాణము తక్కువగా ఉన్నది. విదేశాల నుంచి రావలసిన పెట్టుబడి సరఫరా సమస్య తీవ్రముగా ఉన్నది. ఈ పరిస్థితుల్లో పెట్టుబడులకు ఆర్థిక సహాయము విషయములో అత్యధిక శ్రద్ధ చూపటము సహజము".

అయితే ఇండియా అనుభవముతో అన్ని దేశాలలో అభివృద్ధి కృషిని జతపరచటము తగదని రాయబారి హెచ్చరించారు. ఆయన ఇట్లా చెప్పారు: "ఇండియాలో పెట్టుబడుల సాంకేతిక సుశిక్షితుల సమస్యలే ముఖ్యమైనవి గాబట్టి ప్రతిచోట ఇవి మాత్రమే అవరోధాలనుకోటం జరుగుతున్నది".

పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యము ఇవే మరి ముఖ్యమైనవన్న భావము కలగటానికి కొంత వరకు బాధ్యత అమెరికన్లదే ఇందుకు కారణము, "అమెరికాలో ఆర్థిక విజయాలు మారుతూ ఉండే ప్రభుత్వ దృక్పథముమీద గానీ, సరయిన సాంఘిక వాతావరణాన్ని సృష్టించుకోవటము మీదగానీ, విద్యావంతులయిన పనివారిని సంపాదించుకోవటము మీదగానీ, కాక, పెట్టుబడులు సమకూర్చుకోవటము మీద ఇంజనీర్లను, సాంకేతికులను చేర్చుకోవటము మీద ఆధారపడి ఉండటమే" అన్నారు. "ఒక్క మాటలో చెప్పాలంటే ఇండియా అనుభవాన్ని ప్రపంచము అన్ని దేశాలకు వర్తింపజేయటం జరిగింది. అట్లాగే మా అనుభవాన్ని మేము అందరికీ వర్తింపజేయటము జరిగింది" అన్నారాయన.

ఆర్థికాభివృద్ధి ప్రాథమిక దశలో పరిపాలనలో వివిధ శాఖలను నిర్మించుకోవటము కొలది మందిగా ఉండే మేధావి వర్గాన్ని నిర్మించుకోవటము అవసరము. ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయవలసిన సమస్య అతర్వాత వస్తుంది అన్నారాయన.

శ్రీ గాల్‌బ్రేత్ ఇట్లా వక్కాణించారు: "ఒకటి జరుగుతుంటే మిగతా అవసరాలు వస్తూంటవి. ఆయా దేశాల జనాభాను బట్టి ఆధారాలను బట్టి ఈ అవసరాలు మారుతూంటవి. ఈ మిగతా ఆటంకాలు లేకుండా సాగిపోయే దేశాలకే అభివృద్ధికి పెట్టుబడులు కీలకమవుతవి అన్ని దశలలోనూ సాంఘిక వ్యవస్థ ఆర్థికాభివృద్ధికి అనుకూలముగా ఉండాలి.

"అభివృద్ధి ప్రజాస్వామిక కార్యం. ప్రజా సహకారము లభించినప్పుడే అది సాగుతుంది. ప్రజలకు ప్రయోజనము ఉన్నప్పుడే వారి సహకారము లభిస్తుంది".

సంగారెడ్డి మాణిక్య ప్రభు మందిర కార్యవర్గ ఎన్నికలు

సంగారెడ్డి, జులై 21

మాణిక్య ప్రభు మందిర కార్యవర్గము స్థిరపడిన పిమ్మట రెండు సమావేశాలు జరుపబడినవి. మందిర నికర ఆదాయము మందిర అభివృద్ధి నిర్మాణాది విషయముల గూర్చి చర్చింపబడెను. మండప నిర్మాణమునకు శ్రీ ఆమెటి సంగయ్య దక్షిణ భాగమున తూర్పు పశ్చిమ దిశగా కొంత భాగము ధర్మశాల నిర్మాణమున శ్రీ కె. సంగప్ప వాగ్దానముల జేసిరి. కార్యవర్గ ఎన్నికలలో ఈ దిగువ వారలు ఎన్నుకోబడిరి.

శ్రీ గాదేశంకరయ్య అధ్యక్షులు, గుండ్లపల్లి వెంకయ్య కార్యదర్శి, మాడము కిష్టయ్య కోశాధికారి. సభ్యులు: భీమయ్య, కె. రాజయ్య, ఆమెటి రాజలింగము, మాడము పాండయ్య, ఆగమయ్య, దేవీప్రసాదు, నర్సింగరావు, ఆమెటి సంగయ్య, రాజమౌళిశాస్త్రి సభాపతి పెద్దపాండు రంగముగారలు.

బిక్కనూరు విశాల సహకార పరపతి సంఘం

బిక్కనూర్, జులై 21

15-7-1961 రోజున సర్వసభ్య సమావేశం జరిగి ఈదిగువ సభ్యులు ఎన్నుకోబడిరి:

డి. నారాయణరెడ్డి అధ్యక్షులు, ఎస్. నాగభూషణం ఉపాధ్యక్షులు, చీకోటి రాజయ్య కోశాధ్యక్షులు, బొండ్ల బాగయ్య, డి. సిద్ధారెడ్డి, మాలజంగం బాలరాజయ్య, ఎ. రాజిరెడ్డి పుర్రబాగయ్య (సభ్యులు)

నగర వార్తలు

ఆల్విన్ మెటల్ వర్క్స్

హైదరాబాదు ఆల్విన్ మెటల్ వర్క్స్ బన్‌జాడిలతయారీలోను కార్యాలయాలకు ఇండ్లకు అవసరమయినవి గృహవస్తుసామాగ్రిని తయారు చేయడములోను ప్రసిద్ధిగన్న సంస్థ. దీని షోరూమ్ 20వ తేదీన గన్‌ఫౌండ్రిలో తెరువబడింది. అల్మారాలు రాక్‌లు, టేబుల్‌లు మొదలయినవే కాక ఈ సంస్థ ఉత్పత్తిచేసే నాల్గుసైజులలోగల రెఫ్రిజిరేటర్లు వీని విలువ రు. 15 వందలనుండి రు. 2050 వరకు ఉంటుంది. రు. పదివేల విలువచేసే కటింగ్ మిషన్‌లు రు. 550 విలువచేసే వాషింగ్ మిషన్‌లు షోరూమ్‌లో పెట్టబడినవి. సాలీనా ఆల్విన్ మెటల్ వర్క్స్ రు. 40 వేల వ్యాపారాన్ని చేస్తున్నది. షోరూమ్ ఇన్‌చార్జి జి.ఎస్. మోహన్‌లాల్ జిడ్డు ఆహ్వానించి తమకంపెనీ ఉత్పత్తిచేస్తున్న సామగ్రిని గూర్చి వివరించి చెప్పారు.

ఇంపైన
4 వ సంయుక్త వారం!
సరోజ "శాంత" కూతురేనని అపోహపడిన శ్రీనివాస్ నిజం ఎలా తెలుసుకుంటాడు:
సరోజ జన్మవృత్తాంతం తెలుసుకుంటుందా? చేయూ సరోజలు వివాహం చేసుకుంటారా?
శాంతస్థితి ఏమౌతుంది?
దయాసిధి ఏమౌతాడు?
శాంతికళా ఫిలిమ్స్ వారి!
శాంత
లో, మీరు, మీ కుటుంబం చూచి ఆనందించండి!
కా॥ అంజలి ఎస్.టి.రామారావు గుమ్మడి, రేలంగి, సూర్యకాంతం, గిరిజ, చలం.
సాగర్- హైదరాబాద్.
ప్యారడైజ్ -సికింద్రాబాద్
ఆటలు: 2.30, 6-00, 9-30
రాజరాజేశ్వరి అశోక్
వరంగల్. నిజామాబాద్.
—ఈస్టు ఇండియా విడుదల

11 వ సంయుక్త వారం!
సిందూర్ ఫిలిమ్స్ సమర్పించు
ఎవరు దొంగ?
కా: సరోజాదేవి, ఉదయకుమార్
విజయలక్ష్మి- అమీర్‌పేట
ఆటలు: 2-30, 6-00, 9-30.
3 వ వారం!
జైహింద్-సూర్యాపేట్
—ఉదయశ్రీ పిక్చర్స్ విడుదల.

26 వ వారము!
ప్రసాద్ ప్రొడక్షన్స్:
ససురాల్
కా: రాజేంద్రకుమార్, సరోజాదేవి, మహమూద్, లలితాపవార్.
రాయల్ - హైదరాబాద్
నేడు 8 ఆటలు: 8-30, 6-15, 9-30.
—ప్రసాద్ పిక్చర్స్ విడుదల.
(Trupik)

6 వ సంయుక్త వారము
కె. పి. ఆర్. ప్రొడక్షన్స్ వారి:
కన్నకొడుకు
(తెలుగు)
కా: జగ్గయ్య, దేవిక, రామకృష్ణ, కృష్ణకుమారి, రాజశ్రీ.
రీగల్ జగత్ లక్ష్మి
భైరతాబాద్ సైదాబాద్ వరంగల్.
2-45, 6-15, 9-30 గం॥
(Nima) —పూర్ణా విడుదల.

అద్భుతమైన 4 వ సంయుక్త వారం!
పి. ఎ. ఫిలిమ్సు:
అంగూళిమాల
(టెక్నికలర్)
కా: భారత్‌భూషణ్, నిమ్మి, అనితాగుహ, చంద్రశేఖర్, ఉల్లాస్, అచలసచదేవ్, మన్‌మోహన్‌కృష్ణ, హెలెన్.
ప్రభాత్ అలంకార్
హైద్రాబాద్. సికింద్రాబాద్.
నేడు 8 ఆటలు: 8-30, 6-30 మరియు 9-30 గం॥
—జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ విడుదల.

నేటి రాత్రి నేటి రాత్రి

ప్రేక్షకులచే థియేటర్లు క్రిక్కిరిసి పోవుచున్నవి.
ఉత్తమ ఆశయములుగల కుటుంబ కథా వస్తువు!
కార్మిక హక్కులు, విధుల చిత్రించిన అద్భుత చిత్రము.
రాజన్ ఫిలిమ్స్ సమర్పించు
తేల్ మాలిష్ బూట్ పాలిష్
కా: షేక్‌ముక్తార్, కుమ్ కుమ్, చంద్రశేఖర్, మన్‌పురి, ఆగ.
అశోక్- హైదరాబాద్. మనోహర్- సికింద్రాబాద్.
ఆటలు: 3-30, 6-30, 9-30. —జగత్ పిక్చర్స్ విడుదల.

నేటి రాత్రి నేటి రాత్రి

కడుపుబ్బ నవ్వించు హాస్యరస చిత్రము.
ముంతాజ్ ఫిలిమ్స్
ఛోటెనవాబ్
కా: మహమూద్, అమిత, జానీవాకర్, మినోముంతాజ్, హెలెన్, అన్వర్‌హుసేన్, షీలాపాజ్, నజీర్‌హుస్సేన్.
దీపక్ మహల్ మినర్వా
హైదరాబాద్. సికింద్రాబాద్.
నేడు, రేపు 4 ఆటలు: మ॥ 12-0, 3-30, 6-30, 9-30 గం॥ ఉ॥ 11-0 నుండి 1-00 గం॥ మరియు ఆటలసమయములలో అడ్వాన్సు బుకింగ్.
నేడు, రేపు 3 ఆటలు: 3-30, 6-30, 9-30 గం॥ ఆటల సమయములలో అడ్వాన్సు బుకింగ్.
దీపక్‌లో సోమవారము నుండి 3-30 గం॥ మ్యాటినీ
డిస్ట్రిబ్యూటర్లు: ఫిలిమ్స్ & ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూటర్స్, 184, రాష్ట్రపతిరోడ్, సికింద్రాబాద్.

హైదరాబాద్ & సికింద్రాబాద్ టైర్ సిండికేట్

ట్రాన్స్‌పోర్టు అపరేటర్ల రిజిస్ట్రేషన్ కార్డులలో దిగువ నంబర్లు గలిగి యుండి ఇంతవరకు టైర్లు సప్లయికానట్టివారు, హైదరాబాద్ పబ్లిక్‌గార్డెన్ రోడ్‌లో గల మా కార్యాలయముతో సంప్రదించవచ్చును. టైర్లు తీసుకొనే సమయమున వాహనము యొక్క ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ చూపించవలసి యుండును.

7.50-20 నెంబర్లు 107 నుండి 127
8.25-20 నెంబర్లు 233 నుండి 241

28-7-61 సాయంత్రం వరకు టైర్లు యివ్వబడును.

పురజనులకోరికపైన నేడు, రేపు
ఉదయం 11-0 గం॥ తెలుగు ప్రత్యేక ఆటలు.
ఉత్తమ సాంఘిక కథా వస్తువు.
దేవదాస్ (తెలుగు)
కా: నాగేశ్వరరావు, సావిత్రి, రేలంగి.
ప్రభాత్ టాకీస్- హైదరాబాద్.
తగ్గింపు రేట్లు:- 0-40, 0-80, 1-20, 1-60.
Bahar.

నేటి రాత్రి నేటి రాత్రి
చలనచిత్రరంగములో పేరెన్నికగన్న చిత్రం
సిసిల్ బి. డిమిల్స్:
ది టెన్ కమాండ్‌మెంట్స్
THE TEN COMMAND MENTS
(విస్టావిజన్) (టెక్నికలర్)
కా॥ చార్లటన్ హెస్టన్, యుల్ బ్రై

మంథెన నియోజకవర్గం

ఎన్నికలకు అభ్యర్థుల సన్నాహాలు

మంథెన, జులై 21

కరీంనగరము జిల్లాలోని మంథెన నియోజకవర్గము నుండి రాబోవు జనరల్ ఎన్నికలలో కాంగ్రెసుటికట్ పై పోటీచేయుటకు స్థానిక కాంగ్రెసువాదులు సన్నాహాలు కొనసాగిస్తున్నారు.

ఈనెల 16వతేది ఆదివారం శ్రీ మూల నరసింహారెడ్డి (అడ్వొకేటు) ఇంట కాంగ్రెసువాదులు పంచాయతీ సర్పంచులు శ్రీ వేంకట రాజన్న అవధాని అధ్యక్షతన సమావేశమయి సుదీర్ఘ చర్చలు జరిపిరి. ఈనియోజకవర్గములోని మూడు సంచాయతీకమిటీల అధ్యక్షులు మంథెన, మహాదేవపురము, కమాన్‌పురము భాగములలోని మండల కాంగ్రెసు కార్యవర్గ సభ్యులు, కాంగ్రెసు కార్యశీలసభ్యులు సంయుక్త సమావేశము ఈనెల 27వ తేదీన మంథెనలో జరుప నిశ్చయించినారు. పోటీచేయ గోరు అభ్యర్థులు 50 రూ. ధరావతు చెల్లించి, దరఖాస్తులను ఆ తేదీలోపల శ్రీ వేంకటరాజన్న అవధానికి అందజేయవలెనని ఆపైన స్థానికంగా ప్రజాస్వామ్య పద్ధతిన అధికసంఖ్యాకుల విశ్వాసము చూరగొన్న ఒకేఒక అభ్యర్థి పేరునుమాత్రమే ప్రదేశ్ కాంగ్రెసు ఎలక్షన్ కమిటీకి సిఫారసుచేయవలెనని ఈసమావేశములో నిర్ణయము గయికొన్నట్టు తెలియుచున్నది.

శ్రీయుతులు వి. కిషన్ రావు అడ్వొకేటు, మూలనరసింహారెడ్డి, జి. శ్రీరాములు కాంగ్రెసు టిక్కెటు కయి పోటీచేయనున్నట్లు విశ్వసనీయ వర్గాలద్వారా తెలియుచున్నది.

(స్వ. వి.)

దరఖాస్తులకు గడువు పొడిగింపు

హైదరాబాదు, జులై 21

ఆంధ్రప్రదేశ్ మినిస్టీరియల్ సర్వీసు అడిషియల్ సర్వీసులో గుమాస్తాలు సెక్యూరిటీ గుమాస్తాలు, టైపిస్టులపదవులకూ, సెక్రెటేరియట్ సర్వీసు టైపిస్టులు, స్టెనోటైపిస్టుల పదవులకు దరఖాస్తులు పెట్టుకునే గడువును ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషన్ పొడిగించింది. పైనపేర్కొన్న పదవులకు సాధారణ, ప్రత్యేక పోటీ పరీక్షలకు దరఖాస్తులను ఆగస్టు 10 వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కమీషను కార్యాలయానికి చేరేటట్టు పంపించాలి.

దివాన్ దేవిడి వద్ద
రేపు ఉ॥ 10-0 గం॥
వేలం అమ్మకం
పెద్ద మొత్తములో గల చెక్ వుడ్ దూలములు, వాసములు, తలుపులు, కిటికీలు, 30′×4″×9″ ఇనువకమ్ములు గర్డర్లు, సి. జి. ఐరన్ షీట్లు మరియు అనేకరకముల నిర్మాణపు సామాగ్రి పర్నిచర్, కాకిరీ, డ్యూరీలు, సైకిళ్ళు, మరియు డజనుల కొలదిగల బనారస్ ఇరిస్ చీరెలు, గృహాలంకరణ వస్తువులు.
నేడే తనిఖీ.
జె. మూసా అండ్ సన్స్,
ఆక్షనీర్స్
ఫోన్: 5111.

కాలేజీ చదువుకు కరెస్పాండెన్సు కోర్సులు

వచ్చే జనవరినుండి తొలిప్రయోగం

నిపుణుల సంఘం సూచనలు

న్యూఢిల్లీ, జులై 21

1932 జనవరి 1 నుంచి భారతదేశములో ప్రథమ పర్యాయంగా కాలేజీ స్థాయిలో కరెస్పాండెన్సు కోర్సులు ప్రారంభము అవుతాయి ఈవధకాన్ని ఆ తేదీన ఢిల్లీ విశ్వవిద్యాలయం ప్రవేశపెడుతుంది.

సాయంత్రపు కళాశాలలు, కరెస్పాండెన్సు కోర్సుల పథకం వివరాలను రూపొందించడానికి భారత ప్రభుత్వము నియమించిన నిపుణుల సంఘం ఇటీవల జరిగిన ఒక సమావేశములో ఈ నిర్ణయము చేసింది. సంఘం అధ్యక్షులు డాక్టరు డి.ఎస్. కొఠారీ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఢిల్లీ కరెస్పాండెన్సు కోర్సు పథకం వివరాలను గురించి నిపుణుల సంఘం త్వరలో ఒక ఉపసంఘము పరిశీలిస్తుంది.

కరెస్పాండెన్సు కోర్సులు తయారు చేయడానికి అగ్రశ్రేణి పండితులను అధ్యాపకులను నియమించాలని సభ్యులు అభిప్రాయపడ్డారు.

ఈ పథకాన్ని ప్రవేశపెట్టదలచిన యూనివర్సిటీలన్నీ తమ సాధన సంపత్తిని సమీకరించి సమిష్టిగా వినియోగించాలనీ, కోర్సులు పాఠ్యపుస్తకాలను ప్రమాణీకరించాలనీ, ప్రస్తుతము కరెస్పాండెన్సు కోర్సులను తళలకు అంటే ముఖ్యముగా ఇంగ్లీషు భాష, ఆధునిక భారతీయ భాషలు, గణిత శాస్త్రము, ఆర్థికశాస్త్రము, రాజకీయ శాస్త్రము, చరిత్ర, దర్శనశాస్త్రము, భూగోళ శాస్త్రాలకు ప్రమితం చేయడము మంచిదనీ, డాక్టరు కొఠారీ సూచించారు.

కరెస్పాండెన్సు కోర్సుల పథకాన్ని రూపొందించడానికి కేంద్ర సంస్థ ఒకటి ఏర్పాటు చేయాలనీ, ఈ పథకాన్ని అమలు జరపదలచిన విశ్వవిద్యాలయాలు దానిని అమలు జరపడము కోసము, డిపార్టుమెంటులు లేదా స్థానిక బోర్డులను ఏర్పాటు చేయాలనీ, నిపుణుల సంఘము అభిప్రాయపడింది.

కరెస్పాండెన్సు పథకము క్రింద ప్రతి యూనిటు 1000 మంది విద్యార్థులకు విద్యాసౌకర్యం కల్పించాలనీ, ప్రతియూనిటులో 25మంది అధ్యాపకులుండాలనీ, నివుణులసంఘం నిర్ణయించింది. మామూలు డిగ్రీతరగతి చదువు కంటే కరెస్పాండెన్సు కోర్సుకు ఒక ఏడాది ఎక్కువ అంటే నాలుగేళ్ళు పడుతుందని వారుఅభిప్రాయపడ్డారు. ప్రతి భావంతులైన విద్యార్థుల విషయంలో మూడేళ్ళలోనే ఈ కరెస్పాండెన్సు కోర్సును పూర్తి చేయడం సాధ్యపడవచ్చును. ప్రతి సంవత్సరం చివరలో లిఖిత పరీక్షలు ఉండాలనీ, మొదటిసంవత్సరం చివరలో తగినంత ఆసక్తి లేని విద్యార్థులను ఒక పరీక్షపెట్టి ఏరివేయాలనీ, సభ్యులు అభిప్రాయపడ్డారు.

మొదటిసంవత్సరం రుసుము కొంత ఎక్కువగానేడున్నా, మితిమీరకూడదనీ, రెండవమూడవ సంవత్సరాలలో రుసుమును క్రమేపీ తగ్గించాలనీ, నాల్గవ సంవత్సరంలో రుసుము ఏమీ వసూలు చేయరాదనీ, నిపుణులసంఘం సూచించింది.

నిర్బంధ విద్యద్వారా 24 వేల మంది అదనపు విద్యార్థులు

ఖమ్మంజిల్లా పాఠశాలల్లో ఉచిత సౌకర్యాలు కూడా

ఖమ్మం, జులై 21

ఉచిత నిర్బంధ విద్యాపథకం క్రింద ఖమ్మం జిల్లాలో యీ యేడు 24016 మంది పిల్లలు పాఠశాలల్లో చేరుతారు. ప్రస్తుత విద్యార్థుల సంఖ్య 88,288.

పిల్లలు పాఠశాలలకు వచ్చేలా ప్రోత్సహించుటకై వారికి మధ్యాహ్నం ఉచిత భోజనం, అర్హులైన వారందరికి ఉచితంగా పాఠ్యపుస్తకాలివ్వడం, అర్హులైన విద్యార్థినులకు ఉచితంగా బట్టలివ్వడము, పాఠశాలకు సరిగా వచ్చే విద్యార్థులకు హాజరు స్కాలర్ షిప్‌లివ్వడము జరుగుతుంది.

× × ×

ఖమ్మం జిల్లా కనకగిరి సిరిపురం గ్రామములో 150 మంది రు. 880 చెల్లించి తమ గ్రామంలో సేవింగ్స్ బాంక్ పాసుబుక్కులు తమ పేర జారీచేయాలిందిగా కోరినారు. ఈ గ్రామ పుజనాభా 2000 ఉన్నప్పటికీ యిక్కడ పోస్టాఫీసు లేదు. తమ గ్రామంలోనే తమ డబ్బును పొదుపు చేసుకొనుటకు వీలుగా యిక్కడ పకత పాలా ఆఫీసు తెరవాల్సిందిగా అభ్యర్థించారు. ఈ గ్రామస్థులు తమ గ్రామాన్ని వైరా పంచాయతీలో ఒక ఆదర్శ పొదుపు గ్రామంగా చేసేందుకు పూనుకున్నారు.

× × ×

మే, జూన్ నెలల్లో కల్లూరు సమితిలో 47 ఇనువనాగళ్ళు అమ్ముడు పోయాయి. ఇంకా 200 కావాలని వ్యవసాయదారులు అర్థర్లిచ్చారు. ఆధునిక పనిముట్లను ప్రచారంచేయడంలో యీ సమితి సిబ్బంది సాధించిన కృషిని జులై 10 వ తేదీన సమావేశమయిన జిల్లా సమన్వయ సంఘం శంసించి యీ ఆదర్శాన్ని మ జిల్లాకు లు కూడా అను చాలని కోరింది.

కడం ఆనకట్ట మరమ్మతు

ఎడమకాలువకు నీరు విడుదల

హైదరాబాదు, జులై 21

1958 ఆగస్టులో కడం ఆనకట్టకు గండిపడటంతో, దెబ్బతిన్నంతవరకు పునర్నిర్మించేపని 8.00 ఎకరాల భూమికి సరిపడిన నీటిని వదలటానికి వీలయేంతవరకు పూర్తయింది. ప్రభుత్వానికి ఇంజనీరింగు సలహాదారుడు శ్రీ యల్. వెంకటకృష్ణయ్యర్ జూలై 16 న ప్రాజెక్టు అధికారులు, కంట్రాక్టర్లు, కార్మికులు, రైతుల సమక్షంలో ఎడమకాలువ నీటి పారుదల తూములను తెరిచారు. ఇరిగేషన్ చీఫ్ ఇంజనీరు, నాగార్జున సాగర్ కాలువల చీఫ్ ఇంజనీరు కూడా హాజరయ్యారు.

వచ్చే సాగుతరుణానికల్లా మరమ్మత్తుల పని సంపూర్తి అవుతుందని ఆశించబడుతున్నది. అంతో పూర్తయితే 65000 ఎకరాల విస్తీర్ణానికి నీరు సమవదల వీలవుతుంది.

సికింద్రాబాదు ఆర్యసమాజ ఎన్నికలు

సికింద్రాబాదు, జులై 21

సికింద్రాబాదు ఆర్యసమాజ వార్షిక ఎన్నికలు 16వ తేదీన శ్రీరాం రఖాదండా (ప్రధాన్ ఆర్యసమాజము) ఆధిపత్యములో జరిగినవి. యీ క్రింది వారు ఏకగ్రీవముగా ఎన్నుకొనబడినారు:

అధ్యక్షులు వై. బాలరాజయ్య, ఉపాధ్యక్షులు వేద ప్రకాశ్ దుసాజ్ (మేయరు), శిర్నాంసత్యనారాయణ, బి.ఆర్. లక్ష్మయ్య, కార్యదర్శి భండారి సత్యనారాయణ, సహాయ కార్యదర్శులు సత్యప్రకాశ్, గంగం శ్రీనివాస్, కోశాధ్యక్షులు అన్నం రాంలింగం, పుస్తకాధ్యక్షులు ఆర్. రామచంద్ర. కార్యవర్గ సభ్యులు శ్రీయుతులు బి.వి. గురుమూర్తి, ఎం.ఎల్.ఏ; అనంతబుచ్చన్న, లెల్లెకుమారస్వామి, వీరచల్లయ్య, మనోహర్ జ్ఞాన్‌కోచే, సాలికె నాగేంద్ర, బి. ఈశ్వర్ ఎన్, వెంకటేశం, డి. జగదీశ్, పి. లక్ష్మీనారాయణ, బి-అర్జున్, ఎం.దశరథ్, ఆర్. సత్యనారాయణ పం॥ కృష్ణస్వామి నాయుడు, పిశాంబర్ దాస్ ధన్నులాల్.

స్థానికవార్తలు

ఇప్పటివరకూ మద్రాసులో ఉన్న తంతితపాలా శాఖ రిజనల్ కార్యాలయం హైద్రాబాద్‌కు మార్చబడింది.

న్యూమలక్‌పేటలోని షోయెబ్ స్మారక గ్రంథాలయ సర్వసభ్య సమావేశం ఈనెల 23 వ తేదీ వగలు 11 గంటలకు గ్రంథాలయ భవనంలో జరుగుతుంది.

వచ్చే ఆగస్టు 15 నుంచి కార్మిక వాణి అనే పేరుతో ఒక తెలుగు వారపత్రికనుఐ.ఎన్.టి.యు.సి. రాష్ట్ర శాఖ ప్రచురించ సంకల్పించినది.

1961 ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ పంటల, పశువుల మార్కెట్ల బిల్లుపై నియుక్తమైన సంయుక్త సెలెక్టు సంఘం వచ్చేసమావేశం హైద్రాబాద్ శాసన సభా భవనాలలోని కమిటీ రూములో జులై 27 వ తేదీ 11గంటలకు జరుగుతుంది.

తెలంగాణా ప్రాంతీయ గీత పారిశ్రామిక సంఘ సభ్యులు త్వరలో ముఖమంత్రి తదితర శాఖల మంత్రులను కలుసుకొని 1961-62లో కనీసం వెయ్యి గ్రామీణ, వర్గ సహకారసంస్థలను తమకై కేటాయించవలసిందని అభ్యర్థించనున్నట్లు తెలుస్తున్నది.

సన్మిత్ర నాట్య కళా సమితి 15 వ వార్షికోత్సవం ఈనెల 28 వ తేదీ సాయంత్రం 6 గంటలకు సరోజినీదేవి హాలులో రాష్ట్ర గవర్నర్ శ్రీ భీమసేన్ సచార్ అధ్యక్షతన జరుగుతుంది. ఈసందర్భంలోసాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించబడుతాయి.

రాష్ట్ర గీత పారిశ్రామిక సంఘ కార్యవర్గ సమావేశం ఈనెల 28 వ తేదీ మధ్యాహ్నం చింతలబస్తీలోని సేవాసదన్‌లో జరుగుతుంది.

బేగంబజారు ప్రాంతానికి చెందిన కోల్సవాడి మురికిగూడెంలో నిర్వహించబడే మేయర్ క్యాంపును రాష్ట్ర స్థానిక సంస్థల మంత్రి శ్రీ మందులనరసింగరావు ఈనెల 28వ తేదీన ప్రారంభిస్తారు.

శ్రీ స్వామి లింగస్వాముల వారిచే రచింపబడిన శ్రీ యథార్థ కాలజ్ఞాన చరిత్ర గ్రంథావిష్కరణోత్సవం, ముఖ్యమంత్రి శ్రీ డి. సంజీవయ్యచే ఉపముఖ్యమంత్రి శ్రీ కె.వి. రంగారెడ్డి అధ్యక్షతన 28వ తేదీ ఆదివారము రాత్రి 8 గంటలకు నీకింద్రాబాదు మార్కెట్ స్ట్రీటులోని జెమ్ షెడ్ హాలులో జరుపబడును.

సాలార్ జంగ్ మ్యూజియం బోర్డు సమావేశం

హైదరాబాదు జులై, 21

సాలార్ జంగ్ మ్యూజియం బోర్డు తొలి సమావేశం యీ ఉదయం మ్యూజియం భవనాలలో జరిగింది. ఈబోర్డు అధ్యక్షుడైన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీభీమ్‌సేన్ సచార్ యీ సమావేశానికి అధ్యక్షత వహించారు. కేంద్ర వైజ్ఞానిక పరిశోధనలు మంత్రి శ్రీ హుమయూన్ కబీర్ కూడా ఈ సమావేశానికి హాజరైనారు. బోర్డుకు సంబంధించిన ముసాయిదా నిబంధనలనుఆమోదించి, నిబంధనల పరిశీలనకు, సిబ్బంది పరిస్థితిని సమీక్షించడానికీ, కొత్త భవనాల నిర్మాణపు ఏర్పాట్ల అజ్మాయిషీకి మూడు ఉపసంఘాలను నెలకొల్పారు. ఈబోర్డు బ్యాంకర్లుగా స్టేటు బ్యాంకు ఆఫ్ ఇండియాను నియమించారు. శ్రీ పి.వి. రాజమన్నారు, ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు శ్రీ డి.యస్. రెడ్డి మినహాగా ఈ బోర్డు సభ్యులందరూ సమావేశానికి హాజరైనారు.

మానవుని రోదసీ యాత్రపై గోష్ఠిసదస్సు

హైద్రాబాద్, జులై 21

మానవుడి అంతరిక్ష యాత్ర గురించిన గోష్ఠి సదస్సు యీనెల 17 వ శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయంలో జరిగింది. కార్యక్రమానికి రాష్ట్రవ్యవసాయశాఖ కార్యదర్శి శ్రీ ఐ. జె. నాయుడు అధ్యక్షత వహించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ భౌతిక శాస్త్ర అధ్యాపకులు డా॥ రావాడ సత్యనారాయణ మానవుడు రోదసి యాత్ర చేయుటకు శాస్త్రజ్ఞులు సాధించిన విజయాలను, ప్రగతిని పేర్కొంటూ గగారిన్ ప్రయాణ వివరాలను ప్రస్తావించారు. డా॥ అభయంకర్ యీ యాత్రకై ఉపయోగించబడ్డ వస్తు సముదాయముల సాంకేతిక విషయాలను తెలియచేశారు. ఈ గోష్ఠి సందర్భములో శ్రీ బసవరాజు, భావనారాయణ, మేక్స్ప్లియర్ నాటకాలలోని కొన్ని ఘట్టాలను ప్రదర్శించారు. గ్రంథాలయ కార్యదర్శి శ్రీ పోతుకూచి సాంబశివరావు వందన సమర్పణ చేశారు.

బడిపిల్లలకై టాగూర్ కథ

హిందీలో సాహిత్య అకాడమీ ప్రచురణ

న్యూఢిల్లీ, జులై 21

ఈ ఏడు విశ్వకవి టాగూర్ శత జయంత్యుత్సవాల సందర్భంగా సాహిత్య అకాడమీ 16 పేజీలలో విశ్వకవి టాగూర్ జీవిత చరిత్రను ప్రచురించారు. ఈ చిన్న పుస్తకంప్రత్యేకంగా, బడికివెళ్లే బాల బాలికలకు, ఎంతో అనువైనది. దీన్ని ప్రముఖ బాల సాహిత్య రచయిత్రి శ్రీమతి లీలా ముజుమ్‌దార్ బెంగాలీలో రచింపగా, యుగ్‌జిల్ నవల్‌పురి హిందీలోనికి అనుసరించడం జరిగింది. విశ్వకవి గడిపిన ఉదాత్త జీవితం, ఆయన వ్యక్తిత్వానికి, రచనకూ సంబంధించిన వివిధ అంశాలు ఈ పుస్తకంలో చక్కగా వివరించారు. ముందు అట్టమీద అందముగా టాగూర్ చిత్రం, వెనుకవైపు ఎక్కడ నా మనస్సు భయరహితంగా ఉంటుందో అంటూ మొదలయ్యే టాగూర్ కవితను ఆయన స్వదస్తూరిలోను ముద్రించారు.

ఈ పుస్తకానికి ఇంగ్లీషులో "మన కవి" అనీ, హిందీలోనూ ఇతర భాషలలోనూ "కవి కథ" అనీ పేరు పెట్టారు. అనేకమంది అందుబాటులో ఉండేందుకుగాను దీనికి చవకధరను వెలపెట్టారు. ఈ పుస్తకం ఒక్క సంస్కృతంతప్ప మిగతా అన్నిప్రధాన భారతీయ భాషలలోనూ లభ్యమవుతుంది.

కృష్ణానది వరద బాధితులకు గవర్నర్ విరాళం

హైద్రాబాద్, జులై 21

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ భీమసేన్ సచార్ కృష్ణానది వరద బాధితుల సహాయార్థం 2 వేల రూపాయల విరాళమిచ్చారు. ఈ మొత్తాన్ని వరద బాధితులకు అందచేయుటకు కృష్ణా జిల్లా కలెక్టరుకు పంపారు.

సినిమావర్కర్లసంఘకార్యవర్గము

హైద్రాబాద్, జులై 21

నిన్న జరిగిన స్థానిక సినిమావర్కర్ల సంఘ వార్షిక సమావేశంలో శ్రీ జి. వెంకటస్వామి యం. ఎల్. ఏ; సంఘ అధ్యక్షులుగా ఎన్నికైనారు. ఈక్రింది వారు కార్యవర్గానికి ఎన్నికయినారు. ఉపాధ్యక్షులు శ్రీయుతులు టి. అంజయ్య, అమర్ నాథ్ బర్మన్ ప్రధాన కార్యదర్శి, కోశాధికారి ఎం. ఏ కసూల్, మహ్మద్ హుస్సేన్, మరో 14 మంది సభ్యులుగా ఎన్నికైనారు.

పారిశ్రామిక వివాదాల చట్టం

హైద్రాబాద్, జులై 21

1947 పారిశ్రామిక వివాదాల చట్టం రాష్ట్రంలోని సిమెంటు పరిశ్రమకు కూడా విస్తరింపచేయడం కోసం యీ జూలై 21 నుండి మరో ఆరునెలలపాటు సిమెంటు పరిశ్రమను పబ్లిక్ యుటిలిటీ సర్వీసుగా ప్రభుత్వం ప్రకటించింది.

రాకపోకలు

ఆహార, వ్యవసాయ, అడవుల కార్మిక శాఖల మంత్రి శ్రీ యన్. రామచంద్రారెడ్డి 1961 జులై 31వ తేదీ బయలుదేరి కరీంనగరం జిల్లా, హుజూరాబాదు తాలూకాలోని మాలంగూరు వెళ్తారు. అక్కడ జిల్లా పరిషత్తు హైస్కూల్‌లో 9వ తరగతికి ప్రారంభోత్సవం చేస్తారు. తిరిగి అదే రోజు సాయంత్రం 6గంటలకు హైద్రాబాదు వస్తారు.

ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి అధ్యక్షులు శ్రీ ప్రభాకర్ జీ, శ్రీ సి. హెచ్.వి. మూర్తిరాజు ఎంఎల్.ఏ. అఖిల భారత పంచాయతీ పరిషత్ సమావేశాలలో పాల్గొనుటకు కొత్త ఢిల్లీకి వెళ్ళారు.

దక్షిణప్రాంతీయ మండలి సమావేశం వాయిదా

న్యూఢిల్లీ, జులై 21

రాష్ట్రపతిడాక్టర్ రాజేంద్రప్రసాద్ అనారోగ్య కారణంగా హోంమంత్రి లాల్ బహద్దుర్ శాస్త్రి తమ మైసూర్ ప్రయాణాన్ని వాయిదా వేసుకున్నారు. అందువల్ల రేపు శ్రీ శాస్త్రి అధ్యక్షతన జరుగవలసిన దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశం వాయిదాపడింది.

నిజామాబాదు స్టేషన్ ప్లాట్‌ఫారము

నిజామాబాద్, జులై 21

నిజామాబాద్ స్టేషనులో ప్రయాణికుల ప్లాట్‌ఫారమ్ లేదని యీనెల 19వతేదీన ప్రచురించబడిన వార్తలోని అంశాలు సరికావని నిజామాబాదు ప్లాట్‌ఫారం ప్రయాణికుల అవసరాలకు తగినటులఉన్నదని సికింద్రాబాద్ డివిజనల్ సూపరింటెండెంట్ తెలుపుతున్నారు.

మద్రాసులో అమెరికా రాయబారి గాల్‌బ్రైత్

గవర్నర్, మేయర్, ముఖ్యమంత్రి ప్రభృతులతో సమావేశాలు

మద్రాసు, జులై 21

మద్రాసు నగరానికి వచ్చిన అమెరికారాయబారిజాన్ కెనెత్ గాల్‌బ్రైత్ వచ్చినరోజుసాయంత్రమేమద్రాస్ గవర్నర్ విష్ణురాంమేధీని కలుసుకొన్నారు. రాజ్‌భవన్‌లో రాయబారి గౌరవార్థం గవర్నరు విందు చేశారు. అనాటి సాయంత్రం రాయబారి గాల్‌బ్రైత్ మద్రాసు మేయరు వి. మునిస్వామిని కూడా రిప్పన్ బిల్డింగ్స్‌లో కలుసుకొని అరగంటసేపు సంభాషించారు.

రాజ్‌భవన్ విందుకు హాజరుఅయిన అతిథులలో మైసూర్ గవర్నర్ శ్రీ జయచామరాజ వడయార్ కూడా ఉన్నారు.

రాయబారి గాల్‌బ్రైత్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్‌తో జరిపిన సంభాషణలో కార్పొరేషన్ ఎన్నికల విధానం, మేయర్ పదవీ కాలప్రమాణంగురించి తెలుసుకొన్నారు మద్రాస్ కార్పొరేషన్ ఎదుర్కొంటున్న సమస్యలను గురించి రాయబారి అడిగిన దానికి మేయర్ మునిస్వామి మంచి నీటి సరఫరా అన్నిటికంటే ప్రధానసమస్యఅన్నారు.

ఈ సందర్భంలో రాయబారి గాల్‌బ్రైత్ అమెరికాలో ఉప్పు నీటిని విరిచే విధానాన్ని గురించి వివరించారు. అమెరికాలో ఈ పథకానికి కెనెడీ ప్రభుత్వం నుంచి మంచి పోత్సాహం లభిస్తున్నదన్నారాయన. ఆ కృషి విజయవంతమైనట్లయితే మద్రాసు వంటి నగరాలకు ఇది ఎంతైనా ప్రయోజనకారి కాగలదన్నారు. శ్రీ గాల్‌బ్రైత్ మేయర్‌తో కార్పొరేషన్ సాగిస్తున్న గృహ నిర్మాణ పథకాలు, రోడ్ల అభివృద్ధి, సిటీ ప్లానింగు, పారిశ్రామిక అభివృద్ధి చౌకగా విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేసే పద్ధతులు గురించి చర్చించారు.

అమెరికా రాయబారి జాన్ కెనెత్ గాల్‌బ్రైత్, శ్రీమతి గాల్‌బ్రైత్, కొడుకు అలాన్ గాల్‌బ్రైత్‌లతో కలిసి 18వ తేదీ ఉదయము ప్రత్యేక విమానములో మద్రాసు చేరారు. రాయబారికి మీనంబాకం విమానాశ్రయములో అమెరికన్ కాన్సుల్ జనరల్ డాక్టరు తామస్ డబ్ల్యు. సైమన్స్, మద్రాసు ప్రభుత్వ హోమ్ శాఖ డిప్యూటీ కార్యదర్శి శ్రీ కె. ద్రవ్యం, చెంగల్పట్టు జిల్లా కలెక్టరు కె. శివసుబ్రహ్మణ్యం ప్రభృతులు స్వాగతం చెప్పారు. భారతదేశములో ఒకసువ్యవస్థిత రాష్ట్రముగా పేరు తెచ్చుకొంటున్న మద్రాసుకు రావటము తనకు సంతోషముగా ఉన్నదని రాయబారి గాల్‌బ్రైత్ పత్రికా విలేఖరులతో అన్నారు. ఈ రాష్ట్రము తలపెట్టిన పాఠశాల పిల్లల మధ్యాహ్నభోజన కార్యక్రమము తనకు బాగా నచ్చిందన్నారు.

అమెరికా రాయబారి 19 వ తేదీన మద్రాసు ముఖ్య మంత్రి కె. కామరాజ్‌ను సెక్రటేరియట్‌లో కలుసుకొని మద్రాసు రాష్ట్ర పరిస్థితులను గురించి అరగంట సేపు ఇష్టాగోష్టి జరిపారు. ముఖ్యమంత్రి, రాయబారి గాల్‌బ్రైత్ కి మంత్రులు ఎం. భక్తవత్సలం, ఆర్. వెంకట్రామన్ వి. రామయ్య, శ్రీమతి లూర్థమ్మాళ్ సైమన్‌లకు పరిచయం చేశారు.

మద్రాసు యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ డాక్టరు ఏ. లక్ష్మణస్వామి ముదలియార్ రాయబారి గాల్‌బ్రైత్ గౌరవార్థం విందు చేశారు.

మద్రాసులోని అమెరికన్ కాన్సుల్ జనరల్ డాక్టర్ తామస్ డబ్ల్యు. సైమన్స్ తన నివాస భవనంలో గాల్‌బ్రైత్ గౌరవార్థం విందు జరిపాడు. ఈ విందుకు నగరంలోని ప్రభుత్వ వ్యాపార, ఉద్యోగ రంగాలలోని 800 మందికి పైగా భారతీయ, అమెరికన్ ప్రముఖులు హాజరయినారు.

ప్రసన్న గజానన బాలికోన్నత పాఠశాలలో వనమహోత్సవం

హైదరాబాదు, జులై 21

పంజేర్ గుట్టలోని ప్రసన్న గజానన బాలికోన్నత పాఠశాలలో యీనెల 19న వనమహోత్సవం జరుపబడినది. ఈ సందర్భంలో రాష్ట్ర గవర్నర్ సతీమణి శ్రీమతిలలితాసచార్ పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. గవర్నర్ సతీమణికి పాఠశాల పాలకవర్గ సభ్యులు, సిబ్బంది విద్యార్థినులు ఘనముగా స్వాగతము చెప్పారు. శ్రీమతి సచార్ సంస్థద్వారా జరుగుతున్న కృషిని గమనించి తమ సంతృప్తిని వెల్లడించారు. బాలికలు తమ తలిదండ్రులకు సాయపడాలని హితవుచెబుతూ వీరిని తమ బిడ్డలుగా చూచుకోవాలని ఉపాధ్యాయినులకు సలహా యిచ్చారు. అనంతరం విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల గ్రంథాలయానికి, పిల్లలకు తినుబండారాలు సరఫరా చేయుటకయి శ్రీమతి సచార్ రూ. 2 వందలువిరాళం యిచ్చారు. జాతీయ గీతాలాపనతో ఉత్సవం ముగిసింది.

సాలార్‌జంగ్ మ్యూజియం కళాఖండాల ప్రతిరూపాలతో సంచార శకటాలు

-శ్రీ సచార్ ప్రతిపాదన

హైద్రాబాద్, జులై 21

భారత జాతీయ మ్యూజియంగా రూపొందిన సాలార్‌జంగ్ మ్యూజియంను ప్రతిదినం వెయ్యిమంది దర్శిస్తూ ఉంటారు. మ్యూజియంవారోత్సవాల వంటి ప్రత్యేక సందర్భాల్లో 7 వేల మంది దాకా వచ్చి చూసిపోతుంటారు మనిషికి రూపాయి ప్రవేశ రుసుము వసూలుచేస్తున్నప్పటికీ యింత మంది రావడం సాలార్‌జంగ్ మ్యూజియం కళా వైవిధ్యాన్ని చెప్పక చెప్పుచున్నది.

నిన్న సాలార్‌జంగ్ మ్యూజియం జాతీయ స్థాయి ప్రారంభోత్సవాలకి అధ్యక్షవహించిన మ్యూజియంబోర్డు అధ్యక్షుడు రాష్ట్ర గవర్నర్ శ్రీ భీమ్‌సేన్ సచార్ పై అంశాన్ని పేర్కొన్నారు.

1958 డిసెంబర్ 2వ తేదీన నవాబ్ సాలార్ జంగ్ వారసులు యీ కళాఖండాలసంచయాన్ని సమర్థంగా నిర్వహించ గలిందులకై భారత ప్రభుత్వానికి బహుమతీకరించారు మ్యూజియం లైబ్రరీలనిమిత్తం కొత్త భవనం యేర్పాటుయేవరకు పాత ప్రాసాదములో యీ వస్తువులను ఉంచడానికి అనుమతించారు. నూతన భవనాన్ని నిర్మించేందుకు వారు మూసీనదిఒడ్డున ప్రస్తుత మ్యూజియం భవనానికి దాపులో 5.86ఎకరాలభూమి, 5లక్షల రూపాయలు విరాళంగా యిచ్చారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇందు నిమిత్తం మరో రు. 5 లక్షలు గ్రాంటుగా మంజూరుచేసింది. ఈ సందర్భంలో అయ్యే ఇతర ఖర్చులను భారత ప్రభుత్వం భరిస్తుంది. పక్కన ఉన్న స్థలాలు కూడా కొన్ని కొని మొత్తం 10.16 ఎకరాల భూమిని నూతన భవనం నిర్మాణంకోసంప్రత్యేకించారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుడే నిర్మాణ కార్యకలాపాలను ప్రారంభించిందనికూడా శ్రీ సచార్ తెలిపారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో ఆయా కళాఖండాలతోపాటు వాటి శాలూకు ప్రతిరూపాలు, శాశ్వత ప్రదర్శనకు అవసరంకాని వస్తువులు అనేకంవున్నాయి. గ్రామీణ ప్రాంతాలలో విజ్ఞాన విశాలాలను వ్యాపింపజేయడానికి యిటువంటి వస్తువులను సంచార శకటాలలో పెట్టి యిరుగు పొరుగు జిల్లాలకు పంపుతూఉండవచ్చుననీ స్థానికపాఠశాలల ప్రయోజనార్థం కొన్ని కళాఖండాలను అరువిచ్చే పరిస్థితినికూడా యేర్పాటు చేయగోరుతున్నాననీ శ్రీ సచార్ అన్నారు.

మ్యూజియంఅభివృద్ధికి, ఒక విజ్ఞాన కేంద్రంగా దాని విస్తరణకు శ్రీ సచార్ ప్రస్తావించారు.

మ్యూజియంలో ఒక ప్రత్యేక విద్యాశాఖను యేర్పాటుచేసి, నిర్దిష్ట విషయాలపై ప్రేక్షకులనిమిత్తం ప్రసంగాలను తయారుచేయించడం, స్కూళ్ళలోను, కాలేజీలలోను ఉపన్యాసాలిప్పించడం, ఆకాశవాణి ద్వారా ప్రసంగాలు ప్రసారంచేయడం పత్రికలలో వ్యాసాలు వ్రాయడం, జిల్లాలలో సంచార ప్రదర్శనలు ఏర్పాటు చేయడం మొదలైనవి చేయించవచ్చును. సెలవు రోజులలో పిల్లలు బొమ్మలు వ్రాయడం, నమూనాలు తయారుచేయడం, యింకా యితర సృజనాత్మక కార్యకలాపాలలో పాల్గొనేందుకు ప్రత్యేక తరగతులు యేర్పాటు చేయాలనికూడా అనుకుంటున్నారు. ఈ మ్యూజియం వద్ద సెలవురోజుల్లోను, సాయంత్రంవేళలా వయోజనులు కళలు వృత్తులతో తమ ప్రజ్ఞను అభివృద్ధిచేసి పెంపొందించుకోవడానికిఅవకాశంకల్పించవచ్చును. నాటకాలు, సాంస్కృతిక ఫిల్ములు యిక్కడప్రదర్శించవచ్చును. ఇలా ఈ మ్యూజియంవల్ల ప్రజలకు అధికాధికముగా ప్రయోజనాలు కలగజేసే విషయం పరిశీలనలో ఉంది. నిరుడు ఈమ్యూజియం కొత్త కార్యకలాపాలనేకం ప్రారంభించింది. మ్యూజియంలోని కొన్ని విభాగాలను ఆధునికపద్